# మన వాగ్గేయకారులు -
# తొలి సంకీర్తన కవులు

డాక్టర్ వేటూరి ఆనందమూర్తి

65926/38589

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున ప్రచురితము

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

ప్రచురణ నెం. 27
ఏప్రిల్, 1975

ముద్రణ :
**నాట్యకళ ప్రెస్**
హైదరాబాదు-500004.

వెల : **రెండు రూపాయలు**

*ముఖపత్రం :* **వఝు శ్రీనివాసశర్మ**

ప్రతులకు
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ
కళాభవన్, హైదరాబాదు-500004

# పరిచయము

ఇరువై శతాబ్దాల తెలుగు చరిత్ర సంస్కృతి పునాదులపైన నిర్మింప బడ్డ తెలుగు జాతి సమైక్యతను సర్వతోముఖాభివృద్ధిని పటిష్ఠం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాక్షసనామ సంవత్సర ఉగాది (1975 ఏప్రిల్ 12వ తేదీ) నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నవి. ఈ మహాసభల ఏర్పాట్లకుగాను ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు అధ్యక్షులుగాను, విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారు నిర్వాహకాధ్యక్షులుగాను ఒక సంఘం ఏర్పడింది. ఈ సందర్భంగా 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించడం జరుగుతున్నది.

ప్రపంచ మహాసభలకు నాందిగా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలోను, ఢిల్లీలోను సంగీత, నాటక, నృత్య, జానపద కళోత్సవాలను నిర్వహించే బాధ్యతను, ఆయా కళారంగాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే బాధ్యతను స్వీకరించవలసిందని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీని ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమం క్రింద అకాడమీ విజయవాడలో నాటకోత్సవాన్ని, అనంతపురంలో వీధినాటకం సదస్సును, నిజామాబాద్‌లో నృత్యోత్సవాన్ని, తిరుపతిలో సంగీతోత్సవాన్ని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ జానపద, నాటక కళోత్సవాన్ని నిర్వహించింది,

ఈ సందర్భంలో సంగీత, నృత్య, నాటక, చలనచిత్రాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే అవకాశం కల్పించి, అకాడమీ గ్రంథ ప్రచురణ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం దోహదం చేసింది. అందుకు వారికి మేమెంతో కృతజ్ఞులం. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రచురించిన అనేక గ్రంథాలలో ఈ "మన వాగ్గేయ కారులు తొలి సంకీర్తన కవులు" ఒకటి. ఈ గ్రంథాన్ని రచించిన సుప్రసిద్ధ విద్వాంసులు డా॥ వేటూరి ఆనంద మూర్తిగారికి మా ధన్యవాదాలు.

**జె. బాపురెడ్డి**
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ.

# ముందు మాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండు వేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్యపరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్ళడం జరిగింది. అట్లా వెళ్ళిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆ యా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికి, తద్వారా

వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12 వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలనుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని 'మ్యూజియంను' స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతి నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి.

ఈ గ్రంథాలను రచించి, సకాలంలో పూర్తి అందించిన రచయిత లందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయు లందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు

# పదకవితలు-ఆవిర్భావము

కళ అనేది మానవ జాతియొక్క విశిష్టమైన జీవన విధానమే అంటారు పెద్దలు. కనుక జీవితంలోని వైశిష్ట్యాన్ని ప్రదర్శించేదే కళ. అది లౌకికమైన అవసరాలను తీర్చేదయితే ఉపయోగ కళ అనీ, దాని కతీతమైనరీతిని ప్రకటితమైతే లలితకళ అనీ అంటారు. ఈ కళలన్నిటికీ లౌకికమైన సుఖమో, దానికతీతమైన ఆనందమో కల్గించడమే లక్ష్యమైయుంటుంది. ఈ సుఖానందాల సంపాదనకోసం మానవుడుచేసే విశిష్ట యత్నమే కళగా ఆవిర్భవిస్తుంది.

సంఘ జీవియైన మానవుడు ప్రయత్న పూర్వకంగానూ, అప్రయత్నంగానూ కూడా తాను సుఖానందాలను పొందినపుడో లేక ఇతరులకు తన అనుభూతిని పంచిపెట్టాలనుకొన్నప్పుడో చేసే ప్రదర్శన అతని సమస్త శరీరానికి సంబంధించినదై యుంటుంది. అదే నర్తనానికి, వాగ్గేయాల విస్తృతికి దారితీస్తుంది. దర్శనీయములు, శ్రావ్యములు అయిన ఆటపాటలు ఆవిర్భవిస్తాయి. క్రమంగా ఆ ఆటలు దృశ్య కళలుగాను, పాటలు శ్రవ్యకళలుగాను ప్రత్యేకములై విడిగానూ, కూడి కూడీ మనగల్గుతవి.

వీటిల్లో శ్రవ్యకళా రూపానగల ఆ పాటల నుండే అనగా-ధ్వని సంకేతాల నుండే-ధ్వనినాదాలు గుణంగాగల ధాతువే ప్రాతిపదికగా విస్తృతినందిన కేవల గాన మొకవంకా, అర్థభావాలు జీవంగా

గల మాతువే. ప్రాతిపదికగా విస్తరించిన కావ్య మొుకవంకా వికాసం చెందినవి.

ధ్వనిసంకేత సహకారం లేనిదే శబ్దార్థాలకీ, స్వర ప్రస్తారానికీ తావేలేదు కాబట్టి ఆ రెంటితోనూ కూడే సాధారణంగా వాగ్వ్యవహారముంటుంది. అదే ఉద్వేగాలచేత ప్రేరితమైనపుడు సహజంగానే ఒక విశిష్టగతిని సాగి తాళలయలు నాదరాగాలు అనే రెక్కలు విప్పుకొని తేలికగా హాయిగా ఎగిరే పక్షిలా స్వేచ్ఛా విహారం చేస్తుంది. అదే ఛందో ధర్మాన్ని సంతరించుకొన్న కవిత. ఇతరత్రా ఆ వాగ్వ్యవహారమే తర్కమూ ఆలోచన అన్న మేత కలవాటుపడి సంయమనపు పంజరంలో కట్టువడి మచ్చికవల్ల మర్యాద నేర్చిన పెంపుడు పిట్టలా నిత్య వ్యవహారంలో తోడుపడుతూ వుంటుంది. ఇదే అపాద పద సంతాన మనబడిన గద్య.

ఇట్లా శ్రావ్యములైన గానకావ్య కళలలో కావ్యకళకు చెందినవే గద్య పద్య భేదాలు. అందుకే గద్య పద్య భేదాలచేత కావ్యాలు రెండు విధాలనడం. ఇందులో పద్య కవితాకళ తర్వాత అనంతమైన ఛందో వైవిధ్యాన్ని కూర్చుకొని అక్షరగణ మాత్రా గణాల సంయోజనంతో వృత్తాలుగాను, జాతులుగాను, ఉపజాతులుగాను పలువిధాల వ్యక్తమై రసాభిముఖమైనది. దాని సంపర్కంతోనే తరువాతికాలాన, నిత్య వ్యవహారోపయోగిగా సహజంగా సరళంగా వున్న గద్య కూడా తన ప్రయోజనాన్ని పెంచుకొని, తర్కభారాన్ని తగ్గించుకొని, లయతాళ గంధాన్ని కూర్చుకొని పద్య కవితా కళతోబాటు పోటీ పడసాగింది. ఆ దశలోనే గద్యం కవి పుంగవుల ప్రతిభకు నికషోపలంగా రూపొందినది.

ఇలా లయ తాళ విన్యాససంగల కావ్య కళలోని కూర్పులోనూ గణబద్ధమైన ఛందోరీతిలోనూ తోచే శ్రావ్యమైన విశిష్టగతికి

తర్వాత గానాంశ కూడా తోడై పద్య కవిత నుండి 'పదకవితాశాఖ వేరు రూపు దిద్దుకోగా గద్య కవిత గానాంశను చేర్చుకొని 'వచన సంకీర్తనరీతి'కి దారితీసింది. కావ్య గానకళల మేళగింపుతో ఇలా రూపు సవరించుకొన్న సంకీర్తన పదకవితా ప్రక్రియ తదుపరి నర్తన కళని కూడా మేళవించుకొని త్రివిధకళా సంపుటియైనది.

ఈ విధంగా ప్రాకృతులైన అదిమజాతివారి ఆటపాటల నుండి ఆవిర్భవించిన ఈ కళాత్రిపుటి కాలక్రమాన సంస్కారాన్ని అపేక్షించి, నియమాన్ని గ్రహించి, శిష్టమై, సంకీర్తన పదకవిత అన్న పేరున పండితపామరజనాన్ని సమంగా రంజింపజేసే నూతన ప్రక్రియగా మన వాఙ్మయ ప్రపంచాన వెలసింది.

అసలు తెలుగులో పద్యమంటూ పదమంటూ వేర్పాటే లేదని ఒక విధంగా చెప్పవచ్చును. ఎందుకంటే మనవారి పద్యాలు పదాలు అన్నీ కూడా పాటలే. రచనారీతిలోని భేదాన్ని బట్టి పదమే పద్యంగానూ పద్యమే పదంగానూ భాసిస్తూ వుంటుంది. "స్వస్తినృపాంకుశాత్యన్త వత్సల సత్యత్రినేత్ర విస్తర శ్రీయుద్ధమల్లుడన వద్యవిఖ్యాతకీర్తి" అన్న శాసనస్థ మధ్యాక్కర యతివిసరుపాటువల్లను, సమాస భూయిష్ఠం కావడంవల్లను మనకు పద్యంగానే భాసించినా, "అంతటరాఘవుల వారూ అంగనసీతనుగూడి సంతసమందుచు వేగ స్వపురమునకు చనుదెంచ్రీ" అన్నరీతినున్న రచనమాత్రం ఒక రమ్యమైన జానపద గీతమనే భావాన్నే కల్గిస్తుంది. ఇంతకూ రెంటివెనుకావున్న ఛందమొకటే. కనుక మనవారి మంజరులు, ద్విపదలు, తరువోజలు, రగడలు, సీసాలు, కందాలు వగైరాలన్నీ కూడా మనవారి దృష్టిలో పద్యాలూ, పాటలూ, పదాలూను నడకలోని విరుపూతూగూ విస్మరించిన రచన పాటయొక్క లక్షణాన్ని కోల్పోయి పద్యమనిపించుకొంటుంది. అదే సమంగా పుష్కలంగావున్న రచన పద్యమన్న

భావాన్ని పురస్కరించుకొని పాటలా ఆకట్టుకొంటుంది. అందులోనే వుంది. ఆ తేడా అంటాను !

పాల్కురికి సోమనాథుని ద్విపదలను మనవాళ్ళు నోరార పాడుకొన్నారు. ఆయన తన ద్విపదల్లో మనవాళ్ళు పాడుకొన్న పాతపాటల నెన్నింటినో పేర్కొన్నాడు. "పదములు తుమ్మెదపదముల్ ప్రభాత-పదములు పర్వతపదములానంద పదములు - శంకర పదముల్ నివాళి-పదములు కావేళుపదములుగొబ్బి-పదములు వెన్నెల పదములు సెజ్జ-వర్ణనమతిగణవర్ణణ పదము - లర్ణవఘోషణ ఘూర్ణిల్లుచుండఁ-బాడుచు నాడుచుఁ బరమహర్షమున-" (చూ.పండితారాధ్య చరిత్ర)- ఇవన్నీ ఆయన పేర్కొన్న మన పాతపాటలే. ఈ పాటలనే లాక్షణికులు పదాలనీ, ప్రబంధాలనీ, ఏలలనీ అనేక నామాంతరాలతో వ్యవహరించారు. సామాన్యార్థంలో పదాలన్నా, ప్రబంధాలన్నా ఏలలన్నా పాటలనే! అందుకే ఊగునప్పటియేల ఊయేల, జోగునప్పటియేల జోల-అయివుంటుందన్నారు పితృపాదులు శ్రీ ప్రభాకర శాస్త్రిగారు. ఏలలు, ఓలలు, వాలలు అన్నీ పర్యాయ రూపాలే. ప్రాచీనులు ప్రబంధాలనీ, ఏలలనీ పేర్కొన్న పాటలనే తాళ్ళపాక కవులు పదాలన్నారు. వాటినే సంకీర్తనలనీ వారు వ్యవహరించుకొన్నారు. శృంగార సంకీర్తనలు, శృంగార పదాలు, అధ్యాత్మ సంకీర్తనలు, అధ్యాత్మ పదాలు అని అప్పటివారి వ్యవహారమైతే తర్వాతి కాలాన శృంగార పదమే పదమనీ ఆధ్యాత్మిక విషయంగల రచనలన్నీ సంకీర్తనలనీ,కీర్తనలనీ, గీతములనీ, కృతులనీ రూఢికెక్కినవి. ఈనాడు పాటకు గేయమన్న వ్యవహారమున్నది కాని ప్రాచీనులు దానిని పాటలోని సంగీత రచనకు మాత్రమే వ్యవహరించారు. కనుక ఎవరు ఏకాలన దీన్ని ఏ రీతిని పేర్కొన్నా అవన్నీ పాటకు పర్యాయాలుగానే మనమీనాడు భావించవచ్చును.

"కృతాతసంశబ్దనే" — కీర్తించునది కీర్తనము. సమ్యక్ కీర్తనము సంకీర్తనము. 'గీయత ఇతి గీతమ్'-పాడబడునది గీతములేదా గేయము-కాగా అవాఙ్మానసగోచరమగుదివ్యశక్తిని కీర్తించి పాడునది సంకీర్తన మైనది. ఇట్లా గీయమానమగు కీర్తనపు భక్తుని హృదయాన్ని పర మాత్మని పాదసన్నిధికి తీసుకొనిపోతుంది. 'పదగతా' అని అమరము. అందువలన అలా తీసుకొనిపోయేదే పదమనీ రూఢికెక్కింది. ఇవి అన్నీ పర్యాయనామాలే. ఇలా కీర్తనము పదపు అనబరగిన రచన ప్రధా నంగా సంగీత సాహిత్యముల సమ్మేళన రూపము. ప్రాచీన లాక్షణికు లిందులోని సాహిత్యాంశాన్ని 'వాక్' అనీ, సంగీతాంశని 'గేయ' మనీ వ్యవహరించారు. వీటికే క్రమంగా మాతు, ధాతు సంజ్ఞలు కూడా వున్నవి. ఇట్లా వాగ్గేయ రూపానగల గీతరచన చేయగల వారే వాగ్గేయకారులు ధాతు మాతువులను ఉభయ సంజ్ఞలతో గూడిన రచన చేయగల వాగ్గేయకారుడే 'ఉభయకారు'డనీ అనిపించు కొన్నాడు. ఆ ఉభయకార పదానికి ఏర్పడిన భ్రష్టరూపమే 'బయ కార'పదము.

గీర్వాణ భాషలో దివ్యశృంగారాన్ని రంగరించి అష్టపదులు చెప్పిన గీతగోవింద రచయిత జయదేవుడు (12వ శతాబ్ది), కృష్ణకర్ణా మృతకర్త లీలాశుకుడు (13వ శతాబ్ది) దేశమంతా చెప్పుకొని గర్వింప దగిన గొప్ప వాగ్గేయకారులే. 13, 14 శతాబ్దుల మధ్య కాలంలోనే ఆంధ్రులూ, ఆంధ్ర దేశంలో వర్ధిల్లినవారూ అపారమైన సంగీత శాస్త్ర పరిజ్ఞానంగలవారు అయిన పాల్కురికి సోమనాథుడు, జాయ సేనాపతి, గోపాలనాయకుడు ప్రభృతులు గొప్ప వాగ్గేయకారులూ, లక్షణకారులూను. పోతే ఆంధ్ర దేశం సరిహద్దు ప్రాంతాలైన మహా రాష్ట్ర, కర్నాటక, తమిళ దేశాల్లోనూ భక్తి సమ్మిళితమైన గీత రచనా పద్ధతి ఒకటి పరంపరగా కొనసాగి వస్తూ వుండినది. ద్రవిడ దేశంలోని నాయనార్ల ఆళ్వారాచార్యుల మధుర గేయరచనలు,

కర్ణాటకుల వచనశాస్త్రము, మహారాష్ట్ర మహానుభావుల పారమార్థిక గీతాలు తెలుగువారి నాకట్టుకొన్నవి. తెలుగువారి గీత ప్రబంధ రచనా పద్ధతిపై అన్నింటి ప్రభావంచేతను కొత్త రూపు సంతరించు కొన్నది. ఆ దశలో ఆంధ్రదేశాన క్రీ. 13వ శతాబ్దిలో ఆంధ్ర వేదాంత కర్తయై 'వేదంబు తెనుగు గావించి సంసార భేదంబు మాన్పిన కృష్ణమాచార్యులు' అవతరించి అంతకు పూర్వం నుండీ వున్న నృత్త పదకవితా పద్ధతికి తోడుగా అనిబంధశాఖకి చెందిన 'వచన కవితా పద్ధతి నారంభించాడు. తరువాత క్రీ. 15, 16 శతాబ్దుల్లో తాళ్లపాక కవులవతరించి ఆ పదకవితలకొక నిర్దిష్టమైన రూపు కల్పించారు. వారి కృషివల్ల నిబంధపద కవితా పద్ధతి'కొక చక్కని రూపు ఏర్పడింది. సంకీర్తనా పరిశుద్ధిని చేయబూని తాళ్లపాక అన్నమాచార్యుడు సమన్వయ దృష్టితో లక్ష్య లక్షణాలను రచించాడు.

ఆ తరువాత ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యుడూ మనుమడు చినతిరుమలాచార్యుడు దీక్షతో ఆ కార్యాన్ని తుదముట్టు నిర్వహించి దాక్షిణాత్య సంగీత సంప్రదాయ పద్ధతిలో ఒక కొత్త మలుపు తీసుకువచ్చారు. బహుళాంధ్రోక్తిమయ ప్రపంచాన అలనాటి భారత కవిత్రయం వారికున్నట్లే మన సంగీత సంప్రదాయ ప్రపంచాన ఈ తాళ్లపాక పదకవిత్రయము వారికీ అత్యున్నతమైన స్థానమున్నది. ప్రాఙ్నన్నయ యుగంలోని దేశి సారస్వతాన్ని పుక్కిటబట్టి ఆదికవి నన్నయ్య వాగనుశాసనుడై ఆంధ్ర కావ్య పధాన మార్గదర్శకుడైనట్లే పదకవితా పితామహుడైన అన్నమయ్య కూడా జానపదుల వాగ్వ్యవహారంలో నలుగుతుండిన దేశి వరుసల నుద్ధరించి శిష్టరచనలు గావించి సంకీర్తన పదకవితా పద్ధతి కాదరం కల్పించాడు. కృష్ణమాచార్యులకు, అన్నమయ్యకు పూర్వమున్న గేయ రచనలేవో పాడి పాడిగా వెలసిన లఘు రచనలేగాని నిబంధ

అనిబంధ కవితారీతుల్లో ప్రఖ్యాత కవు లానుపూర్వితో రచించినవేవీ కానరావు.

అన్నమాచార్యులకు పూర్వం నూరు నూటయేభై యేండ్లకు పైబడిన సంగీత సంప్రదాయమొకటి మార్గదేశి పద్ధతుల సమ్మేళనంతో సోమనాధుని కాలం నుండీ దక్షిభారతంలో వర్ధిల్లుతుండగా వారసులై ఆ సంపదనంతా స్వాయత్తం చేసుకొని తాళ్ళపాక పద కవులు పదుగురికీ పంచిపెట్టారు. అన్నమాచార్యులే మొట్టమొదట 'సంకీర్తనా పరిశుద్ధి'ని చేయబూని ఒక లక్షణ గ్రంథాన్ని, అదిగాక ఆ లక్షణాలకు లక్ష్యాలనదగిన పదాలను ముప్పది రెండువేలకు పైగాను చెప్పారు. అదే ఆరంభం తెలుగు దేశం నలుమూలలా పద కవితలు ప్రాకిపోయి పరిపరివిధాల కుసుమించి రసభావపరిమళాలు గుభాళింపజేయడానికి.

# అనిబంధపదాలు—వచనకీర్తన కవితా పద్ధతి

అన్నమచార్యులవారు తెలుగు సంకీర్తన లక్షణాన్ని సంస్కృత భాషలో రచించారు. అది ఈనాడు మనకు లభ్యంకాలేదు. దాన్నే ఆయన కుమారుడు పెదతిరమలాచార్యులు చాటూక్తిని వ్యాఖ్యానించాడు. ఆ వ్యాఖ్యకూడా మనకీనాడు లభించలేదు. ఆ రెంటినీ పరిశీలించి తెలుగున సంకీర్తన లక్షణాన్ని వెలయించినవాడు అన్నమాచార్యుల మనుమడైన చినతిరుమలాచార్యులే. అదే మనకిప్పుడాధారం. ఆ నాటి పదకవితా సంప్రదాయాన్ని లక్షణాన్ని గుర్తించడానికి ఆయన ఇలా చెప్పుకొన్నాడు.

పరమామ్నాయ సమానమై వెలయు మత్తాతా మహాగ్రంధమున్
వరచాటూక్తిమదీయ పుణ్యజనక వాఖ్యాతమున్ వేడ్కదా
చరణాంభోరుహముల్ మదిందలచి సచ్ఛాస్త్రజ్ఞు లింపొందగా
వరుసం జెప్పెద బద్ధరూపమున దద్వాక్యానుసారంబునన్ (-17)

మహనీయంబగు సంకీర్తన నామకపద సంప్రదాయం బెట్టిదనిన

* * *

భరతాదులు గ్రంధంబుల
విరచించిన లక్షణములు వేంకటభూమీ
ధరవరకీర్తన లక్ష్యము
లురుపదకవితా పితామహుండేర్పఱచెన్ (-13)

ధరలో దాళమపాక యన్నయ గురు - త్తముఁడుండు సంకీ_ర్తనా
పరిశుద్ధిన్ మును జేయబూని తగనుత్పాదించెద ల్లక్షణం
బరుదై మించిన సంస్కృతంబున గవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిలశాస్త్ర సమ్మతముగా భావజ్ఞులానానవన్ (-15)

అట్టిపదం బెన్ని విధంబు లంజెలు వొందుననిన

బంధుర వృత్తపదంబు ని
బంధపదము, చూర్ణపదము, భరతాగమసం
బంధంబున బదవిజ్ఞా
నాంధులకును దాళ్ళపాకయన్నయ దెలిపెన్ (29)

అందు వృత్తపదం బెట్టిదనిన

అందము నై షడ్వింశ
చ్ఛందోగణయుక్త వృత్తజాతుల పదముల్
కుందనమునకుం బరిమళ
మందిన క్రియ వృత్తపదము లలరుచునుండున్ (30)

మరినిబంధనామపదం బెట్టిదనిన

యతులుం బ్రాసములుంబదంబులును మాత్రానీకముల్ తాళసం
గతులుంగల్గి నిబంధనామపదమాఖ్యాదర్ధ సంయుక్తన
త్కృతియై తాళమపాక యన్నయగురూక్తిన్ లోకవిఖ్యాతమై
జితమాధ్వీకసితాసుధారసరుచిస్ఫీతంబునై చెన్నగున్ (౩4)

మరియుం బూర్ణాఖ్యపదం బెట్టిదంటేని—
ధరగృష్ణాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధచ్ఛందో

విరహితమై చూర్ణాఖ్యం
బరగు న నిర్యుక్తనామ్న భాసితమగుచున్ (-54)

మరియుం దచ్చూర్ణంబెట్టిదనిన—

ఛందోగణములనియతిం
బొందక తాళప్రమాణమున గడుజెలువై
కొందరిచే దచ్చూర్ణం
బందముగా తాళసంధియన బొగడొందున్ (-55)

ఇట్లా ఈ లెక్కన పదాలు ప్రధానంగా మూడు విధాలు. అవే 1. వృత్తపదాలు; (పాటలనిపించే మన పద్యాలూ పద్యాలవలెతోచే మనపాటలూ. అంటే మనవారి మంజరులు, ద్విపదలు, రగడలు, ఉదాహరణ ప్రబంధాలు మొదలైనవన్నమాట!) 2. నిబంధపదాలు-యతిప్రాసలుకల్గి మాత్రాగణప్రధానమై తాళసంగతిగల్గి అన్నయగురూక్తిన్ లోకవిఖ్యాతి గాంచినట్టివి; 3. అనిబంధ చూర్ణపదాలు-కృష్ణాచార్యాదిక పరికల్పితము, తాళబంధముగానీ ఛందముగానీ లేనట్టిది (మన ప్రాచీన వచన సంకీర్తనలితీరులే). ఈ చూర్ణ పదమే తాళగంధం కల్గినదై 'తాళగంధి' అనిపించుకొన్నది. (పెదతిరుమలాచార్యుని శ్రీ వేంకటేశ్వర వచనములవంటివి.

తాళ్ళపాకవారి "సంకీర్తన లక్షణం" లో సంకీర్తన మనబడే పదరచనా ప్రక్రియ వృత్త, నిబంధ, అనిబంధ భేదాలచేత మూడు తెఱుగులని వివరింపబడినట్లు తెలుసుకొన్నాము. వాటిల్లో వృత్త పదం సంస్కృత భాషలోని "షడ్వింశచ్ఛందోభేదముల" నుండి పుట్టిందనీ, అనిబంధ పదం "కృష్ణాచార్యాదిక పరికల్పితపద" మనీ, నిబంధ పదం తాళ్ళపాక అన్నయ గురూక్తిన్ లోక విఖ్యాతమై

చెన్నొందినదనీ వారు వివరించారు. వీటిల్లో అనిబంధ నిబంధ పద రచనలని రెండు విధాల పేర్కొనబడిన రచనారీతులనే స్థూలంగా మనం వచన సంకీర్తన కవితాపద్ధతి అనీ, పదకవితా పద్ధతి అనీ పేర్కొనవచ్చు. వీటిల్లో పదకవితా పద్ధతి క్రీ॥ 15 వ శతాబ్ది నుండే తాళ్ళపాక కవుల మూలాన్నే వ్యాప్తికి వచ్చినదైనా వచన సంకీర్తన పద్ధతి మాత్రం అంతకెంతో పూర్వమే తెలుగున వైష్ణవకవులగు కృష్ణాచార్యాదులచేత ఆరంభింపబడి తరువాత పలువురు శైవవైష్ణవ కవులచేత పాటింపబడి, తాళ్ళపాక కవులచేత తాళగంధి వచనాలుగాను విన్నపాలుగాను పోషింపబడి నట్టిదే అని మనం అనుకొనవచ్చును. కాబట్టి మొదట ఇక్కడ కొంత ప్రాచీనమైన ఈ వచన సంకీర్తన పద్ధతిని గురించే తెలుసుకొందాము.

# అనిబంధపదాలు-వచన సంకీర్తనకవితాపద్ధతి

తెలుగున విడిగా ఈ శాఖలో లబ్ధమైన సారస్వతంలో క్రీ॥ 13 వ శతాబ్ది పూర్వార్ధంలో వర్తిల్లినకృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనాలే తొలిరచనలనుకోవచ్చు. అలాగే ఇంకా గంగాధరయ్య వచనాలు, శంకరవచనాలు, కాలజ్ఞాన వచనాలు, కాశికాధీశ్వర వచనాలు భవానీ మనోహర వచనాలు మొదలైనవి కొన్ని శైవుల వచనాలున్నవి. కాని వీటి కాలాన్ని గూర్చి కాని కర్తృత్వాన్ని గూర్చి కాని ఈనాడు మనకంత స్పష్టంగా తెలియదు. ఏమైన ఇవి ఇంచుమించు క్రీ॥ 14 వ శతాబ్దికి తరువాతివే గాని ప్రాచీనములుకావేమో అని విజ్ఞులంటారు. కాని ఒకటి మాత్రం సత్యం. ఏమిటంటే తెలుగున వెలసిన ఈ వచన సంకీర్తన పద్ధతిమీద అంతకెంతో ప్రాచీనమైన కర్ణాటకవీరశైవ వచనాల యొక్క, సంస్కృతంలో భగవద్రామానుజ విరచితమైన గద్యత్రయం యొక్క ప్రభావం ఎంతగానో వున్నది. ఏమైనా తెలుగు వచన సంకీర్తన రచయితలలో ప్రముఖుడు, తాళ్ళపాక వారిచేత అనిబంధపదరూపమగు చూర్ణాఖ్యపదానికి పరికల్పకుడని కీర్తింప బడ్డవాడు అయినకృష్ణమాచార్యుడే ప్రథముడు. ఈయన రెండవ ప్రతాపరుద్రుని (క్రీ. 1254—1323) కి సమకాలికుడు. "సింహగిరి నరహరి నమోనమో దయానిధీ" అన్న మకుటంతో వచనాలను నాలుగు లక్షలకు పైగా రచించాడు.

కర్ణాటకమున శైవుల వచన రచనలు "వచన శాస్త్రముగా" ప్రశస్తి వహిస్తే వీరి రచనలు "వచన సంకీర్తనములు"గా పేరు మోసినవి. ఈ భక్తిరచనలను కృష్ణమాచార్యుడే 'సంకీర్తనము' అనీ, 'ధ్యాన సంకీర్తనము' లనీ పేర్కొన్నాడు లభ్యమవుతున్న అతని వచనాలనుబట్టి అనినాడు. అవి రాగతాళములతో పాడబడుతుండి నట్లు తెలుస్తుందే కాని వాటి రాగతాళ నిర్దేశం మనకెప్పుడు తెలియదు. బహుళః సంకీర్తన లక్షణాన్ని రచించిన నాటికే తాళ్ళ పాక వారికే తెలియదేమో కూడాను అందుకే కావచ్చు కృష్ణమా చార్యాదుల రచనలను 'తాళబంధచ్ఛంధో విరహితమై చూర్ణాఖ్యం బరగు' నని వారు నిర్వచించారు. కాని అటు తర్వాత పదిహేనవ శతాబ్ది తుదిభాగంలో వెలసిన తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని వైరాగ్య వచనమాలికా గీతా లనబడే 'వేంకటేశ్వర వచనాల' కు తాళ్ళపాకవారే రాగతాళాలనునిర్ధేశించి రాగిరేకులపై చెక్కించారు. అందుకే కావచ్చు "కొందఅచేఁ దచ్చూర్ణంబందముగా తాళగంధి యనఁబొగ డొందున్" అని వారే చెప్పుకొన్నారు. కృష్ణమా చార్యాదుల వచనాలలో కన్నా తాళ్ళపాక వారి వచనాల్లో 'తాళ ప్రమాణము గడు[జెలువై' యుండటం వాస్తవమేగానీ కృష్ణమా చార్యుడు కీర్తనలూ తాళగంధి చూర్ణకములే అనుకొనదగినట్లున్న రచనలు కొన్ని అతనివి లేకపోలేదు.

ఇట్లా రాగతాళాలతో కూడి భక్తితో పాడుకోడానికి వీలైన ఈ వచన సంకీర్తనల్ని రచించిన వారిలో ఆద్యుడూ అప్రతిమానుడూ అయిన కృష్ణమాచార్యుని జీవిత రచనా విశేషాలను గూర్చి ఇక్కడ కొంత వివరించడం ఆవశ్యకం కాకపోదు.

### కృష్ణమాచార్యుని జీవితం—రచనలు (క్రీ॥ 1268-1323)

శిఖా, యజ్ఞోపవీతము, కటి సూత్రము, కాషాయవస్త్రము ధరించి, లలాటాన తిరుమణి తిరుచూరాలు తీర్చి, దండే చిటితాళాలు

సంధించి, ఘుమ ఘుమ ధ్వనులు మ్రోయగా తాళం వుగ్గలిస్తూ పంచమ వేద శ్రుతుల్ని చాతుర్లక్ష సంకీర్తన వాక్పూజలుగా గానంచేసి సింహాద్రి నారసింహుని పరవశింపజేసిన పరమభక్తుడీ కృష్ణమాచార్యుడు.

ఈతని కాలం కాకతీయ చక్రవర్తియైన రెండవ ప్రతాపరుద్రుని సమకాలమని ఏకశిలానగర వృత్తాంతము, ప్రతాపచరిత్రము మొదలైన గ్రంథాలను బట్టి తెలుస్తున్నది. అంటే క్రీ॥ 13వ శతాబ్ది ఆఖరు, 14 వ శతాబ్ది ప్రారంభము అన్నమాట. ఆ ప్రభు వీ భక్తసుకవిని మెచ్చి సన్మానిస్తే వాటిని కూడా ఈతడు స్వామికే అర్పించుకున్నాడు. అలాటి ఈ మహనీయుని జీవిత వాహిని ముందు కొన్ని ఒడుదుడుకులకు లోనైనా, కొందరు భాగవతోత్తముల సంసర్గ ఫలితంగా పవిత్రీకృతమై సరళమగు భక్తి మార్గాన ప్రవహించి ప్రవహించి చివరకు దయా సముద్రుడైన పరమ పురుషుని చేరుకొన్నట్లు తెలుస్తుంది.

స్వచరిత్రాత్మకములైన ఈతని వచనాలనుబట్టే ఈతని జీవిత విశేషాలు కొన్ని మనకు తెలియవస్తున్నాయి. ఈ పుణ్యాత్ముడు వికృతి (1290) నామ సంవత్సరమున జన్మించి నట్లూ తర్వాత 16 పండ్లకు సంకీర్తన రచన కారంభించినట్లూ తంజావూరి తాళపత్ర ప్రతిలోవుంది. కాని నా వద్ద నున్న ఒక తాళపత్ర గంథంలో ఇలావుంది.

"దేవా ! సర్వ పరిపూర్ణంబైన మీరు పుట్టించిన జంతు రాసులలో నేను మానవుండనై జన్మించి అనేక కర్మంబులు జే...సవిస్తారంబులు తేట తెలియక ఏవిధంబునం గానక యుంటినో దేవా. నీవు నా మనంబున బాంధవ గోత్రాది వరులను గడిపితివిగాన నీ జపంబునం చేసి తారణ నామ సంవత్సర భాద్రపద మాసంబున కృష్ణ పక్షపు గురువారము దినమందున 14 ఘడియల మీదట (శ్రీ) మధ్యాంతనే పొడ

గంటనో దేవా ! ప్రహ్లాద నారద పరాశరపుండరీక వ్యాసాంబరీష శుక శౌనకాది పరమ భాగవతుల పాడగంటినో దేవా ! మీ తిరుమణి తిరు చూర్ణంబులతో ఆడుచుం బాడుచు ఉగ్గళింపుచు మీ తిరునాళ్ల తిరు మేనియందు అవధరి స్తిరి గాన మాయతిరామానుజా ! దేవా ! నాకు హితుండవు. అనుకూల శత్రుండవుగాక వెనుకటి జన్మంబున పుట్టిం పుచు గిట్టింపుచు నరకానంబడ ద్రోయుచు వేయుచు మోయింపుచు పరమాచార విశేష భాగవతుల సమ్మదంవల్ల నిన్నెరింగితిగాన అది యెరింగి నన్ను దయజూడవో మాయతి రామానుజ ముని ధరంబా తారు నారసింహగిరి హరీ నమోనమో !" ఈ వచనాన్ని బట్టి తారణ నామ సంవత్సరంలో ఆతిధివారాలకి సమమైన క్రీ॥ 1284 ఆగస్టు 31 వ తేదీనగాని, సెప్టెంబరు 7 న గానీ ఆయనకు స్వామి దర్శనమైనదన్న మాట ! స్వామి దర్శనమయే నాటికి ఆయన వయసు పదహారేళ్లనీ అప్పటి నుండే సంకీర్తన రచన కుపక్రమించాడనీ ఆయన వచనాలలో ఉన్న విషయమే. కాబట్టి ఆయన జననం తంజావూరు ప్రతిని బట్టి పూర్వం భావించినట్లు వికృతిలో కాకపోవచ్చుననీ స్వామి దర్శనమైన తారణ (క్రీ. 1284) కి పదహారేళ్ల వెనక — అంటే క్రీ॥ 1268 లో కావచ్చుననీ అనుకోవచ్చునేమో ! ఈయన సంతూరు లేదా సంతన పురము అనే గ్రామాన (ఇది తెలంగాణా మహబూబ్‌నగర్ జిల్లాలోని సంత పూరు కావచ్చునని మా మిత్రులు డా॥ కులశేఖరరావుగారు వ్రాశారు) ఒక వైష్ణవ కుటుంబాన జన్మించాడు. వ్యతిపాత యోగ మున పుట్టడంచేతను, పుట్టగానే అంధుడై ఉండడంమూలానను జననీ జనకులు దయమాలి ఆపిల్లవాని నొకపాడుకూపానపడవేసిపోయారు. అప్పుడు నృసింహస్వామియే కుమారనాముడగు ఒక సన్యాసి రూపానవచ్చి ఆ పిల్లవానిని వెలికి దీసి కాపాడి ఒక మఠంలో కొన్నా ళ్లుంచి రక్షించాడు. ఆ తర్వాత సింహాచలానికి చేర్పించాడు. అక్కడే స్వామివారు అభిషేక క్షీరాన్ని ఒక బాలుని రూపంలోవచ్చి కృష్ణ

మాచార్యునికిచ్చి వెడితే. అతడు దాన్ని ఆరగించి భక్తితో కన్నులా కద్దుకోగా. పోయిన కళ్ళూ రెండూవచ్చి చూపు ఆనింది. ఆ రాత్రే స్వప్నంలో స్వామి వరాహరూపాన ప్రత్యక్షమై తన సన్నిధిని చాతుర్లక్ష సంకీర్తన వాఙ్మూజలు చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తే ఆదేశానుసారం కృష్ణమాచార్యులు సంకీర్త రచన కారంభించాడు. ఆ రచనా ప్రారంభం 'పరాభవ నామసంవత్సర ఆషాఢ శుద్ధ ద్వాదశి' నాడు అని తంజావూరు ప్రతిలో వుంటే నా దగ్గరున్న ప్రతిలో 'తారణ-భాద్రపద-కృష్ణపక్షం - గురువారం' అని వున్న విషయ మిప్పుడే చెప్పుకొన్నాము కదా !

తర్వాత కొంత కాలానికి ఆతని మేనమామ శ్రీ రంగాచార్యులు స్వామి యనుగ్రహంచేత కృష్ణమాచార్యుని గుర్తించి కూతురునిచ్చి పెండ్లి చేశాడు. పెండ్లికి స్వామివారు కూడా వచ్చారు. చల్లగా కొంత కాలం సంసారం సాగింది. ఒక కొడుకు పుట్టాడు. కాని దురదృష్టంవలన ఆ బాలుడు ఏడవపటనే పరమపదించాడు. భగవల్లీలనేమో కానీ ఆపైన కృష్ణమాచార్యులొక ప్రక్కన సంకీర్తన వాఙ్మూజలు గావిస్తూనే వేశ్యాలోలుడై విహరిస్తూ వుండేవాడు. ఇలా వుండగా ఒకసారి సంకీర్తన రచయిత అనీ పరమభక్తుడనీ ప్రఖ్యాతిగాంచిన కృష్ణమాచార్యుని దర్శించడానికని పొతకమూరులోని (ఈ వూరు నెల్లూరు జిల్లా దర్శిడివిజనులోదే కావచ్చునంటారు) భాగవతులూ, అహోబలేశుని నాట్యవినోదులూ అయిన సోదరులు ఆర్గురు. నారాయణయ్య, ఓబళయ్య, అచ్యుతయ్య, అనంతయ్య, లక్ష్మయ్య, చెన్నమయ్యావారు అనేవారు సుదూరం ప్రయాణించి సింహాచలం చేరుకొన్నారు. వారు ఆ వూళ్లో కృష్ణమాచార్యుని తిరుమాలిగెకోసం వెతుకుతూ కాకతాళీయంగా వేశ్యాలోలుడై మోహనాంగి అనే వారకాంతతో వినోదిస్తుండిన కృష్ణమాచార్యునే చూసి గుర్తించలేక వివరాలడిగారు. ఆ పుణ్యా

తున్నాడు పదకొండో అవతారమనీ, బహుదూరం నుండి దర్శింపవచ్చా మనీ చెప్పుకొన్నారు. ఆ పొతకమూరి సోదరులు పరమభాగవతులనీ, వారు పటము పన్నించి పాడగా స్వామివారు ఆనందించే వారనీ కృష్ణమాచార్యులు వారిని గురించి ఇదివఱకు వినేవున్నాడు. ఇప్పుడు వారిరాక తనకోసమే అని తెలుసుకొని అలాటి ఉత్తములు భక్తులు అంతదూరం నుంచి తనకోసం రావడం, తానేమో తేనెలో పడ్డ ఈగ లాగా వేశ్యాలోలుడై ఈ రీతి నుండడం తలపోసుకొని పశ్చాత్తాప్తుడై మనసు మార్చుకొని తెలివిని పొందాడు. కాని తత్కాలానికి తన వున్న వునికి వెల్లడి కానీక (శ్రీ)వారితిరోమాళిగ చూపిస్తాడు రండని తీసుకువెళ్ళి చాటున తలనీలాలు మీసాలు బోడించుకొని విరాగివేషం బున పరమభక్తాగ్రగణ్యుడైన కృష్ణమాచార్యుడుగా ప్రత్యక్ష మవు తాడు. పొతకమూరి భాగవతులు దండప్రణామాలాచరిస్తారు. కాని కొంతసేవటికి తాముపూర్వం చూసిన శృంగార పురుషుని ఆకృతి విశే షమే వీరిలోనూగు ర్తించడంవలన తామేదో అపచారంచేసినట్లుభయాం దోళనలు చెందారు. పదకొండో అవతారమని ప్రసిద్ధిగాంచిన ఆమహా నీయుని శృంగార లీలలకు తెలియక తాము అంతరాయం కల్గించి నందుకు తటతట దవడలు వాయించుకొని అపచారం మన్నింప వేడు కొంటారు.దానితోకృష్ణమాచార్యునిపనిఉక్కిరిబిక్కిరై పోతుంది.వారి రాకవల్లనే తనలో వైరాగ్య వృత్తి కల్గిందనే వాస్తవానికి తానంతటి యోగ్యుడు కాననీ కృష్ణమాచార్యులు భాగవతులతో చెప్పుకొం టాడు. తర్వాత పరస్పరం ఒకరినొకరు సంభావించు కొంటాడు. పటము పన్నించి అహోబలేశుని ఆడించే పొతకమూరి భాగవతుల నాట్య వినోదాన్ని కృష్ణమాచార్యుడూ, ఆతని సంకీర్తన మహి మను పొతకమూరి భాగవతులూ దర్శించే, వినీ పరస్పరం ఆనందిం చారు. ఆ ఆనందంలో అక్కడి స్వామి కూడా పసివాడై పాలుపంచు కొన్నాడు, పటము పన్నించి పాడిన పొతకమూరి అన్నల పాటలు

విని ఆనందించడానికి నృసింహస్వామియే బాలుడై వచ్చి చేరెను. పిదప కృష్ణమాచార్యులు సంకీర్తన లాలపిస్తుండగా ఆ బాలుడానంద తాండవం చేశాడు. ఇలా వారి గానమహిమకు చొక్కి పరవశించి ఆడిన ఆ బాలుడే పరమపదనివాసుడని గుర్తించిన తర్వాత ఆ ఖ్యాతి కృష్ణమాచార్యులదని భాగవతులు, భాగవతులదని కృష్ణమా చార్యులు పరస్పరము సంభాషించుకొన్నారు. అప్పటికి కృష్ణమా చార్యులు చాతుర్లక్ష సంకీర్తనలలో లక్షా యేభై వేలింకా వ్రాయ వలసి వున్నట్లు చెప్పుకొన్నాడు. అవీ కృష్ణమాచార్యులు తర్వాత పూర్తిచేసే వుంటాడు. వానినన్నిటిని కృష్ణమాచార్యుడు పాడు తుండగా బాలుడై వచ్చిన స్వామియే ఘంటము పుచ్చుకొని వ్రాస్తూవుండే వాడట. ఆ కీర్తనలన్నీ ఆ కాలంలోనే రాగి రేకులమీద కెక్కినట్లు కూడా ప్రతాప చరిత్రలో ఏకామ్రనాథుని కథనాన్నిబట్టి తెలియవస్తుంది. గిట్టనివారు ప్రభుత్వపు సొమ్మును దుర్వినియోగంచేసి తామ్రపత్రికలు చేయించి కృష్ణమాచార్యులు శ్రీరంగానికి తోలుకుపోతున్నాడని ప్రతాపరుద్రునితో విన్నవించు కొంటారు. కాని ఆ ప్రభువు ఆ మహనీయుని మహిమ నెరిగినవాడు కావడంచేత వారికేది యిష్టమో అదే తనకూ ఇష్టమని విని మిన్న కుంటాడు. ఆ సంగతి తెలుసుకొని కృష్ణమాచార్యులు మెచ్చి వాసు దేవుని కీర్తించి ఒక వచనం చెప్పి ఏకశిలానగరంలో కనకవర్షం కురి పించినట్లు కథ వుంది. ప్రతాపరుద్ర చక్రవర్తి మెచ్చి కృష్ణమా చార్యులకు కనకగిరిసీమలో ఏభై గ్రామాల కధికారిగా చేసినట్లు కూడా ప్రతాప చరిత్రనుబట్టి తెలుస్తున్నది. ఇట్లా ఆ వచన సంకీర్త నలను రాగి రేకులమీది కెక్కించడమే కాకుండా ప్రచారార్థమేమో వాటిని శ్రీరంగానికి తీసుకొనిపోయినట్లు కూడా వార్త వున్నది. సింహాచలం కొండమీద ఈ రాగి రేకుల నుంచడానికి గుడిలో ఒక భాండాగారం నెలకొల్పినట్లు కూడా తెలియవస్తుంది. ఏమైనా

ఇప్పుడా రాగి రేకులుకావు సరిగదా మన దురదృష్టమున నాలుగు లక్షల వచన సంకీర్తనలలో సరిగా వందయినా చివరికి మిగులక పోయాయి. అదీ శాపఫలితమని సింహాచలానికి సంబంధించిన కొన్ని కథలున్నవి. ఏది యేమైనా భక్తిసంకీర్తనలను పాడుకొంటూ, మహిమలెన్నో ప్రదర్శిస్తూ ఈ మహనీయుడు, పుట్టింది సంతనపురంలోనే అయినా, బహుకాలం సింహాచలంలోనూ, నడుమ కొంతకాల వోరుగల్లులోనూ, చివరకు శ్రీరంగంలోనూ జీవయాత్ర సాగించినట్లు తెలుస్తుంది. ఆంధ్ర దేశంలోని ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రాల నన్నిటిని దర్శించినట్లు కూడా తన వచనాలలో ఆయనే పేర్కొన్నాడు.

ఆంధ్ర దేశంలో ఈ తీరు వచన రచనకి, భజన సంకీర్తన పద్ధతికి పరమాచార్యుడు, ప్రపితామహుడు అయినవాడు మన మెరిగినంతలో ఈ కృష్ణమాచార్యుడే. 'ఓం నమోనారాయణా' అనీ, 'నమోనమో లక్ష్మీవల్లభ' అనీ, 'అనాథపతి సింహగిరి నరహరి నమోనమోదయానిధీ' అనీ, 'మాయని రామానుజమునివరందాతాచు కృష్ణకువ్వారస్వామి సింహగిరి నరహరి నమోనమో దయానిధీ' అనీ శతకమర్యాదచొప్పున మకుటాలుంచి స్వామివారి అనంత కళ్యాణ గుణ కథల్ని కొనియాడుతూ వచన రూపాన విన్నపాలు చేసుకొనేవాడు. వాటినే ఆతడు ధ్యానసంకీర్తనలనీ, నామసంకీర్తనలనీ, వేదాంత సంకీర్తనలనీ, కొన్ని కొన్ని వర్గాలుగా విభజించుకొన్నట్టున్నాడు. లభిస్తున్న తాళపత్రాల్లో ఈ తీరుల పేర్కొనబడ్డ వచన సంకీర్తనలు కానవస్తున్నాయి. తాళబంధచ్ఛందో విరహితమై చూర్ణాఖ్యంబరుగు న నిబంధపదరచనలకు పరికల్పకుడుగా ఇతణ్ణి తాళ్ళపాక కవులు పేర్కొన్నా తాళగంధ వచనాలుగా తలపదగిన ఈతని వచన సంకీర్తనలు కొన్ని మనకు కనపడకబోవు. ఆ తీరు రచనలే కాక వెనుక నాపరిశీలమున అతనివే వృత్తపద, నిబంధ పదాలకోవకు చెందినవీ కొన్ని బయలుపడినవి. ఆ కారణంచేతనే తెలుగు దేశాన భజన

సంకీర్తన పద్ధతులకు కృష్ణమాచార్యుడే ప్రపితామహుడని నా భావం. అందుకే తాళ్ళపాక కవీశ్వరులు ఆయన్ని భక్తితో పేరెత్తి స్మరించారు.

కృష్ణమాచార్యుడి కృతులలో నేటికి లభ్యములైనవి మూడు నాలుగున్నవి. వాటిల్లో మొదటిది ప్రసిద్ధమైనది ఆయన వచన సంకీర్తన సంచయం.

## 1. వచన సంకీర్తనలు

కృష్ణమాచార్యుడు ఈ వచనసంకీర్తనలను నాలుగు లక్షలు రచించినట్లుగా ప్రసిద్ధి. వీటినే అతడు వచనాలనీ, విన్నపాలనీ, సంకీర్తనలనీ, నామసంకీర్తనలనీ, వేదాంత సంకీర్తనలనీ, ధ్యాన సంకీర్తనలనీ పలువెలుగుల పేర్కొన్నాడు. కృష్ణమాచార్యులు సంకల్పించిన చూర్ణపదము తాళబంధచ్ఛందో విరహితమై యొప్పునని తాళ్ళపాక కవీశ్వరులు వివరించినా కృష్ణమాచార్యుడే తన వచనాలలో దండెయు చిటతాళాలు సంధించుకొని పొతకమూరి భాగవతుల సన్నిధిని నారాయణుని నామగుణ కథలను ఘుమఘుమ ధ్వనులు మ్రోయగా దండెమీటుచు, తాళముగ్గ వాపుచు వచన భావంబున విన్నపము గావించినట్లు చెప్పుకొన్నాడు కదా! కాబట్టి ఈతని వచనాలలో అన్నీ కాకున్నా కొన్నియైనా తాళగంధి చూర్ణములే అనుకోవలసివుంటుంది. వీటిలో తాళం మాత్రమేకాదు యమకాంత్యానుప్రాసాది శబ్దాలంకారాలు, ఛందోగంధము, చిత్తమా, మనసా, జయవిజయీభావ మున్నగు సంబుద్ధులు, గీతాన్ని తలపించే గురుప్లుతస్వరాలూ, ప్రతి చరణాంతమున పాడదగు పల్లవిని బోలిన పాద నిర్మాణము మొదలైన అంశాలన్నీ నిబంధ పదాల్లోని గేయాంశనే వెల్లడిస్తున్నవి. మచ్చుకీవచన ప్రారంభం చూడండి.

> "దేవా! ఒకపరి మిమ్ము నెఱుంగుదుమయ్యా
> ఒకపరిమిమ్ము నెఱుంగమయ్యా

జ్ఞానిని చేయుమయా అ
జ్ఞానిని చేయకుమయ్యా
పుణ్యంబిది పాపంబిది-స్వర్గంబిది నరకంబిది
ఆచారంబిది యనాచారమిది-నిషేధంబిది యనిషేధంబిది"

ఇది చక్కగా తాళానికొదిగి నిబంధపడమూ అన్నట్లే వుంది. ఇలాగే

"దేవా! విష్ణుభక్తిలేని విద్వాంసుని కంటె
హరికీర్తనము సేయునతడె కులజుండు
శ్వపచుండైననేమి-ఏ వర్ణంబైననేమి
ద్విజునికంటె నతడె కులజుండు ద్రష్టించి చూడంగ
విద్వజ్జన వైభవ దివ్య భూషణము
సింహగిరి నరహరిం దలంచిన యతడె కులజుండు
చతుర్వేద షట్‌శాస్త్రముల్ సదివిననేమి
శతక్రతువు లాచరించిననేమి
సకల ధర్మంబులు సేసిననేమి
మాసింహగిరి నరహరి దాసులకు దాసులై నంగాని లేదుగతి
స్వామి సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ"

"దేవా! తనువులు మాయ, తలపోసి తలపోసి చెప్పేనంటినా-

కణకణల మోహమిది, ఆశల పాపం డంబిది, అతుకుల జల్లెడ యిది. తన బ్రదుకుకొఱకు పోరాడి పోరాడి యొరులం జెరిచెడి దుర్గంధంపు డొంక యిది...ఇది నాటకములాడేది బూటకపు బొమ్మ-అమ్మమ్మా ఈ బొమ్మ నృత్తములెంచి చూచెదనంటినా-గామై, పామై, గ్రామ సూకరమై, చండపిల్లియై, పిల్లిగోటి యొలకై, పూతై, పూత లాకుమీనై, కత్తి కోతలంబడి-చచ్చి చచ్చి పుట్టి పుట్టి..."

"దేవా! అంకిలియనియెడు తెవులు ఇంటింటికి డ్రిప్పు-అసత్య కృత్యమెముప్పు. తనువు ధర్మమున నడిపినదే యొప్పు. అనాధపతి సింహగిరి నరహరి మిమ్ము దలంపనిదే తప్పు. సింహగిరి నరహరీ నమో నమో దయానిధీ"...మొదలైన వచనాలలో కొంత కొంత ఛందో బంధము, శబ్దాలంకారాలు కానవస్తవి. "అజ్ఞానజడిత కర్మంబులంద గిలి కలంగకా-సుజ్ఞానివై సింహగిరి నరహరి దగిలియందే-సుఖివి గమ్మా -చిత్తమా!" అనే వచనంలో గురుప్లుతస్వరాలు పాటపాడే వైఖరిని సూచిస్తున్నవి. ఇలాగే 'ఓం నమోనారాయణాయ' అనీ 'మిమ్మునెవ్వడు నమ్మనే ఓం నమోనారాయణాయ' అనీ పదింబ డిగా పల్లవి పాటగా వచ్చే ఒక వచనంలో సుస్పష్టంగా నిబంధపద సంప్రదాయమే గోచరిస్తుంది. సరిగ్గా ఈ వచన సంకీర్తన గురించే కావచ్చును ఘుమఘుమ ధ్వనులు మ్రోయగా దండెమీటుతూ తాళం ఉగ్గళిస్తూ 'అలాపవర్ణంబెరుంగను, నమోనారాయణా అని మీ నామ గుణకథలు వచన భావంబున విన్నపంసేతు'నని పాడిన విషయం తంజావూరు ప్రతి 32వ వచనంలో వివరింపబడ్డది. ఇలాగే ఆయన ఇంకా 'నవరత్న పంచరత్న సంకీర్తన'లను చెప్పినట్లుగా వ్రాసు కొన్నాడు. ఆచార్య సూక్తి ముక్తావళిలోనూ కృష్ణమాచార్యుల ఈ తీరు రచనలనుగూర్చిన ప్రస్తావన వున్నది.

ఈయన వచన సంకీర్తనములను పరిశీలించినప్పుడు రచనా విధానంతోనేగాక భావంలోనూ కూడా కృష్ణమాచార్యులు తర్వాతి సంకీర్తనకారులకెల్లా మార్గం మలిచినాడో విశదం కాగలదు. మరి చూడండి.

'దేవా! శ్రీ మన్నారాయణా! పరబ్రహ్మ స్వరూపా! అఖి లాండకోటి బ్రహ్మాండ నాయకా! వేదాంత వేద్యా...... అనుజ సేవితా! మైథిలీసమేతా! ఆనందమయా! జయజయ రాఘవేశ్వరా!

మాయతి రా సుజ......" ఇలాటివే ఆయన పేర్కొన్న నామ సంకీర్తనములు.

"దేవా! మీపాద తులసి యందలి చవి యెరింగిన వారమృతాది రుచులు తృణీకరింతురు... దేవా మీ సౌందర్యము దరిసించిన కన్నులకు ఇతరమైన రూపములు చూడ పాపములు. దేవా మీ అసంఖ్యాక పరిమళ కధామృతము ఘనతరముగ గ్రోలిన జనులు ఇతర కధల నెరుంగరు దేవా! సర్వగంధా! సకల బాంధవుండవై ఇటువలె నిఖిలేంద్రియ భోగ్యమై నన్ను రక్షింపవే అనాధపతి సింహాగిరి నరహరి నమోనమో దయానిధీ" — పంచేంద్రియ పరితృప్తిని గొలిచే కీర్తనమిది. ఇలాటి వాటికే అతడు ధ్యాన సంకీర్తనములని పేర్కొన్నాడు. దేవా! చతుర్వింశతి తత్వాత్మకమైనది స్థూల తనువు. సప్తదశ తత్త్వముల కూటమి సూక్ష్మ తనువు. ఈ రెండు తనువుల ఉత్పత్తి నాశనములకు కారణమైనది కారణ తనువు. ఈ తనువుముల బాపవే పరబ్రహ్మ సింహగిరి నరహరి నమోనమో దయానిధీ! మొదలైన తాత్త్వక వచనాలనే తను వేదాంత కీర్తనలనుకొన్నాడు.

ఈతని వచన సంకీర్తనలన్నీ ప్రధానంగా భక్తిని ప్రపంచించునవే. దేవాంతర మంత్రాంతర సాధనాంతరముల వర్జించి వైకుంఠ వాసునేనమ్మి 'నీవేతప్ప నితఃపరంబెరుగ'నని అర్పించడమే అందున్న సందేశం. వీటిలోని భాష కూడా వ్యావహారికంలో భక్తి భావాన్ని అప్రయత్నంగా అమాయకంగా ప్రదర్శించే రీతిని వుంటుంది. ఆడుతా పాడుతా కుమ్మరిసారెవలె తిరుగుతూ, మునుగుతా, లేస్తా, అంగడి వేశ్య, అంకిలి సేయకు, పరుషంబులు, అరుహముగాదు, చదివినన్నేమి, ఆచరించినన్నేమి, వచ్చని, కలిగని మొదలైన పదప్రయోగాలీతనివి తరువాతి సంకీర్తనకారుల రచనల్లోనూ విరివిగా కానవస్తవి

పదాలేకాదు భావాలు సైతం తరువాతి కాలపు ప్రబంధ రచయితలు సంకీర్తన రచయితలు అనుకరించినట్లు తెలుస్తుంది. "సకల జీవ హింసలు చేసి (జంతువుల తలల్ను ఖండించిన) లోహమున్ను, వేద శాస్త్ర పురాణంబులు వ్రాసే లోహమున్నూ పరుసవేది సోకినంతనే సువర్ణంబైనట్లు" దేవా! అభ్యాసీపరానిది రెండు ఆచార్య కటాక్షం బొక్కటి. అటుమీద మీదాసుడౌటొక్కటి" మొదలైన భావాలు ఆముక్తమాల్యద—మాలదాసరి కథలో కానవస్తున్నాయి. అలాగే—

1. "శ్రీ వైష్ణవులె పరమ సాధకులు శ్రీవైష్ణవులె బ్రాహ్మణులు"

2. "హరిభక్తిలేని విద్వాంసుడి కంటెను హరికీర్తనము సేయు నతడెకులజుండు శ్వపచుడైనన్నేమి? ఏ వర్ణంబైననేమి?

3. "దేవా! మీ చరణ యుగళసేవకు ఏకులజుండైననేమి?"

4. "దేవా! పెద్దతనంబుచేసి మిమ్ము మెప్పించేనంటినా
జాంబవంతుడు మీ సన్నిధినే యున్నాడే దేవా
బుద్ధినినే మెప్పించే నంటినా
విభీషణుడు మీ సన్నిధినే యున్నాడే దేవా"

మొదలైన వచనాలలోని భావాలెన్నో తాళ్ళపాకవారి సంకీర్తనల్లో పలుతావుల ఏ̄డనూపుతవి. సామ్యం చూడండి.

1 "అణురేణు పరిపూర్ణుడైన శ్రీ వల్లభుని
ప్రణుతించు వారు వో బ్రాహ్మణులు॥
హరి నామములనె సంధ్యాది విధులొనరించు
పరిపూర్ణమతులు వో బ్రాహ్మలు

హరిమంత్ర వేద పారాయణులు భక్తి
పరులైన వారు వో బ్రాహ్మలు (11-3-151)

(అన్నమా. సం.)

2. "కొంచెమును ఘనమనిగనుఁగొన నేలహరిఁదలచు
పంచమహాపాతకుడె బ్రాహ్మణోత్తముడు"

పరమగు వేదాంత పఠన దొరికియు సదా
హరిఁదలచలేని సన్యాసి కంటె
మరిగి పసురము దినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముగొలిచినను బ్రాహ్మణోత్తముడు

(అన్నమా సం. 11—3—117)

3. "పకులజుండైననేమి ఎవ్వరైననేమి
ఆకడ నాతఁడె హరి నెరిగినవాడు

(అన్నమా. సం. 5-195)

4. 'రామరామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటన నేతేజమునాది"

వారిధిదాటి మెప్పించ వాయుజుడనేగాను
సారెబవుల మెప్పించ శబరిగాను
బిరాన సీతనిచ్చి మెప్పించబునకుండగాను
యేరీతి మెప్పింతు నన్ను నెట్లుగాచేవో

(అన్నమా. సం.)

(ఈ చివరి ఉదాహరణమే తర్వాత పట్నం సుబ్రహ్మణ్యయ్య గాగి పరిదాన మిచ్చితే అనే బిలహరిరాగ కీర్తనగా రూపొందినది.)

ఇట్లా గానయోగ్యములైన కృష్ణమాచార్యుని వచనసంకీర్త నలే ఆంధ్రమునందలి వచన సంకీర్తన వాఙ్మయశాఖలో ఆదికృతులనీ, కృష్ణమాచార్యుడే సంకీర్తన పరమాచార్యుడనీ తెలియవస్తుంది.

కృష్ణమాచార్యుని రచనలు పై చూర్ణములేకాక నృసింహ నామాలు, రామనామ కీర్తనము, రామనామాలు అనే మరికొన్ని రచనలు కూడా వృత్త నిబంధ పదశాఖలకి చెందినవి మనకి దొరికినవి. వాటిని గూర్చి కూడా కొంత తెలుసుకొందాము.

## 2. నృసింహనామాలు

ఇది నృసింహస్తోత్రం, ధ్యాన సంకీర్తనము, "శ్రీనృసింహా" అని ప్రతిపాదాంతంలో ఉండడం వలన దీనికీ పేరుకలింది. రెండేసి పాదాలు ప్రాసచేత బంధింపబడి ప్రతిపాదంలోనూ రెండేసి ఆ వృత్తాల తర్వాత యతి చెల్లుతూ సాగిన దేశి గేయరచన మిది. తురగ వలన జాతి రగడకు చెందినది. కనుక వృత్త పదశాఖకి చెందిన దన వచ్చు. (చివరి కొద్ది భేదాన్ని తప్పిస్తే ఉత్సాహ లక్షణం కూడా ఇదే) మాత్రా ఛందస్సు ననుసరించి రెండేసి పాదాలకు తకిట తకిట తకిటతకిట అని పాదానికి నాలుగు చొప్పున వెరసి ఎనిమిదేసి ఆవృత్తాలున్నవి. ఇది త్రిశ్రజాతి-ఆది తాళాని కొదిగే రచన-ఇట్లా నృసింహ నామాంతములై నాల్గేసి ఆవృత్తాలతో కూడిన పాదాలిందులో ఏభై దాకా ఉన్నాయి. ఆపైన స్తోత్రము ద్రుతగతిని సాగి పాదంలో రెండవ, నాల్గవఆవృత్తాలలో శ్రీ నృసింహా—శ్రీనృ సింహా అనే సంబుద్ధులు రెట్టించివచ్చి నాల్గేసి ఆవృత్తాలుగల పాదాలు ఓపాదానికాపాదం ప్రాసయతిచేత కూర్పబడినవిగా ఐదున్నవి.

ఆరంభము: శ్రీకరంజ భూరుహాఖ్యసెలసి వెలయు శ్రీనృసింహా
చకరావతారధీర పృథుల వక్ష శ్రీనృసింహా
వేదరాశితుదను వెలుగు విశ్వభర్త శ్రీ నృసింహా
ఆదిదేవసి చరిత్ర మద్భుతంబు శ్రీనృసింహా...

అంతము : గతివి నీవె శ్రీనృసింహా పతివి నీవె శ్రీనృసింహా
జయమునీవె శ్రీనృసింహా ప్రియమునీవె శ్రీనృసింహా

అనంతరము ఫలశ్రుతి:-ఇది పూర్వభాగ సంకీర్తనము ధ్యానసంకీర్త నము ఇది పరమ రహస్యము. ఇది పంచమవేదంబు. ఈ సంకీర్తన నిత్యకృత్యంబు ఎవ్వరు వ్రాయుదురు, ఎవ్వరు చదువురు, అట్టివార లకు ఆయురారోగ్యైశ్వర్యములు కలుగును. అనంతకోటి పుణ్యం బులు కలుగును. ఆపదోద్ధారక! అఖిలమంత్ర రాజాధిపా! చింతిత ఫలదాయకా! పరతత్వ ప్రకాశ! పరంధామా! పరమపురుషా! పరం జ్యోతీ! మాయతి రామానుజముని వరందాతారు అనాధపతి సింహ గిరి కృష్ణమవ్వారుస్వామి సింహగిరి నరహరి నమోనమో దయా నిధీ" అనే వచనం ఫలశ్రుతిగా వుంది. ఇలాటిదే ఈతని లఘుకృతి.

3) రామనామ కీర్తనలు

ఇది రామనామ మహిమను వెల్లడించే ధ్యానసంకీర్తనము. ఇందులో ప్రతి పాదాంతమందు 'రామునామము' అని వస్తూ వుం టుంది. రెండేసి పాదాలు ప్రాసచేత కూర్చబడి ప్రతి పాదంలోనూ రెండావృత్తాల తర్వాత యతిచెల్లుతూ వుంటుంది. వృషభగమన మనే రగడజాతికి చెందిన రచన. మిశ్రజాతి చాపుతాళానికొదిగి 'తకిట తకతక తకిట తకతక' అనే ఆవృత్తాలు పాదానికి నాలుగేసి చొప్పున రెంటికీ నెరసి ఎనిమిదేసి వుంటాయి. ఇలాటి చరణాలిందులో ముప్ఫయిమూడు వున్నాయి. చివరికి ద్రుతగతినందుకొని 'తకిట తకతక రామునామము-తకిట తకతక రామునామము' అన్నరీతికి యతితోనో ప్రాసయతితోనో కూడిన విడివిడిపాదాలు పదిహే నున్నవి తిలకించండి.

ఆరంభము- "శ్రీమదఖిల రహస్య మంత్ర విశేష ధామము రాము
నామము

సామవేద విధూత శాస్త్ర విచారనామము రాము
నామము

సిద్ధకిన్నర సాధ్యపన్నగ సిద్ధసాధ్యము రామునామము
యుద్ధ మధ్య మహోద్ధతాసుర యోధ భీమము రాము
నామము"

అంతము- "ముక్తిదము శ్రీ రామునామము భుక్తిదము శ్రీ రాము
నామము

కడువిచిత్రము రామునామము కల్పభూజము రాము
నామము"

చివరకు- ఇది పూర్వభాగ సంకీర్తన, ధ్యానసంకీర్తన ఇది పరమ రహస్యము. ఇది పంచమవేదము. ఈ సంకీర్తన నిత్యకృత్యంబుగా నెవ్వరు విందు రెవ్వరు పఠియింతు రెవ్వరు వ్రాయుదురట్టి వారి పితృపితామహ ప్రపితామహులు వైకుంఠమునంబొందుదురక్షై- మియాన-మీచరణంబులాన -అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! ఆపద్బాంధవా! అఖిల మంత్ర రాజాధిపా! చింతిత ఫలదాయకా! పరంధామా! పరమపురుషా! పరంజ్యోతీ! పరతత్వ ప్రకాశా! శరణు శరణు మాయంతి రామానుజమునివరందాతారు అనాధపతి సింహగిరి కృష్ణకువ్వారుస్వామి సింహగిరి నరహరి నమోనమో దయానిధీ" అనే ఫలశ్రుతి వచనంతో కృతి ముగుస్తుంది. ఇట్టిదే మరొకటి—

4) **రామనామాలు**

ఇదీ పైనాటివలెనే గానయోగ్యమై 'రామా రామా' అనే పాదాంత సంబుద్ధులుగల రామనామ కీర్తనము విశేషమేమంటే ఈ

సంకీర్తనములో రామనామ స్తోత్రములతో బాటు రామాయణ గాథ కూడా క్రమంగా స్ఫురిస్తుంది. ప్రాసనియము లేకుండా ప్రతి పాదం లోనూ యతిగానీ, ప్రాసయతిగానీ చెల్లుతూ భజనపరులు పాద పద్యంతో పాడుకోడానికి కనువైన రచనమిది. మధురగతి రగడ వికారమనదగిన రచనమిది. ఈ పంక్తులు చూడండి.

ఆరంభము— "దశరధాత్మజ రామా రామా
ధన్య చరిత్రా రామా రామా
భరతాగ్రజ రామా రామా
పంకజేక్షణ రామా రామా
మిత్రతేజా రామారామా
సుమిత్ర వరదా రామా రామా"

అంతము— "నందితాత్మజ రామా రామా
నందితాభరణ రామా రామా
మానసింఘుం రామా రామా
దీనబంధూ రామారామా"

ఈ సంకీర్తనంలో ఇలాటి పాదాలు నూటపద్దెనిమిదివరకు వున్నవి. తకధిమి తక తకధిమి తకధిమి అనే ఆవృత్తాలతో చతురస్రజాతి ఏక తాళానికొదిగే గీతమాలిక యిది.

ఈ రచనలేకాక తాళపత్ర గ్రంథాలనుబట్టి కృష్ణమా చార్యులు ఇంకా తులసీమహాత్మ్యము, కేదారేశ్వర వ్రతకథ అనే రెండు వచన కీర్తనలను కూడా రచించినట్లు తెలుస్తుంది. ఆయన వాటిని సంకీర్తనములని పేర్కొన్నాడు. కాని అవి కేవలం అతని ధ్యాన వేదాంత కీర్తనముల వంటివికాక సింహగిరి వచనాలలో కొన్నింటివలెనే కథా ప్రధానమైన వచనాలుగా కనిపిస్తాయి. ఇక్కడే

ఇంకో ముచ్చట. రచన ఎవరిదోగాని కృష్ణమాచార్యుని సింహగిరి వచనాల్లో ఒక గీతం ప్రస్తావింపబడింది. ఒక కథా వచనంలో కృష్ణమాచార్యులు తాను చిన్ననాడు చేసిన అఘాయిత్యాన్ని వివరిస్తూ తానూ, ఒక కోమటి చిన్ననాడు కోడిపుంజుల పందెం వేసుకోడం, పందెంలో తన కోడి మరణించడం, మాత్సర్యంతో మదోన్మత్తుడై తానా కోమటి చిన్నవాణ్ణి కొట్టడం, దానితో వాడు మరణించడం తర్వాత ఇతడు తన కీర్తనమహాత్మ్యంచేత స్వామిని వేడుకొని ఆ చిన్నవాణ్ణి బ్రదికించడం వ్రాసుకొన్నాడు.

"ఈ విధమున ఆ కోమటి చిన్నవాని కోడిన్ని నా కోడిన్ని యేవిధాన యుద్ధం సేయుచున్న వే దేవా!

ఘటిత ముఃఖవర ధరిత సంధిత కౌస్తుభాం (జయ) శోభితమ్
(...)మకుట కఠోర వందిత కుంభినీజయ శోభితమ్
కనకఘన పీతాంబరాచ్యుత కౌస్తుభా జయశోభితమ్

అ— — — — — — — —

— — — —గిత దోళక అది జంకిణి శోభితమ్

కిణి కిణింకిణి కిణి కిణింకిణి కిణి కిణింకిణి కిణి కిణిమ్

ఆదికాలము......అనాధిపతి స్వామి సింహగిరి నరహరి॥ దేవా యీ గీతవిధంబున యుద్ధంబు సేయుచుండగాను" అని వచన మధ్య భాగంలో ఈ గీతం ప్రస్తావించబడింది. ఇది తరళ వృత్తానికి సన్నిహిత మైన రచనగా వుంది. పాదానికి 26 మాత్రలు. రెండేసి చరణాలు చొప్పున ప్రాసఘటితమైన సంస్కృత రచన. యతి కూడా పాటింప బడ్డది. ఇది తప్పక ఎవరో తెలుగు కవి వ్రాసిందే. కృష్ణమాచార్యుని దేనేమోకూడాను! ఎందుకంటే తంజావూరు ప్రతి 5వ వచనంలో తన 'గీత ప్రబంధాల' విషయము, 32వ వచనంలో వారు 'నవరత్న

పంచరత్న సంకీర్తనలు చెప్పగా' స్వామియే బాలుడై గంటం పట్టుకొని వ్రాయడం కృష్ణమార్యులు చెప్పుకొన్న విషయమే!

ఈ విధంగా కృష్ణమాచార్యుని పై రచనలన్నీ కూడా రాగ తాళాలతో పాడదగిన ధ్యానసంకీర్తనములే. గీతమాలికలే. స్తోత్ర ప్రాయములే వృత్తనిబంధ అనిబంధ రచనల కోవకు చెందినవే. వీటిని కృష్ణమాచార్యులు అంతకు పూర్వం తెలుగునగల దేశి సారస్వతం లోని వరుసలను, మట్టులను గ్రహించి రచించి వుంటాడని తలప వచ్చును. తరువాత తాళ్ళపాక కవులూ ఇలాగే ఇలాటి మట్టుల తోనే అనేక సంకీర్తనలు రచించారు కూడా. ఈ కీర్తనలు చూడండి.

"అతి శోభతేయం రాధా
సతత విలాస వశారాధా॥
దర్పక బలబోధారాధా
తర్పణ గంధవిధా రాధా
దర్పయుత క్రోధా రాధా॥
దర్పకరస వేధారాధా"

"ఏమి చిత్రం బేమి మహిమలు ఏమి నీ మాయావినోదము
వామనాచ్యుత నిన్ను తెలియగ వసుధలో మా తరములా"
(అన్నమా. కం. 2-25)

"పుడమిలోన మగలు గలుగు పొలతులకును దిరుగబాసె
అడివివారి నుండనియ్యడమ్మ నీ కొమారుడు.
(అన్నమా. కం. 2-309)

పైన ఉదాహరించిన అన్నమాచార్యులవారి కీర్తనలలో కృష్ణమాచార్యుల రగడ రచనల్లోని మట్లు ఎట్లా పరిశుద్ధిని బడసి మలచుకొనబడినవో పరిశీలించండి.

పై పరిశీలనాన్నిబట్టి కృష్ణమాచార్యుడే మన సంకీర్తనపద వాఙ్మయానికి పరికల్పకుడనీ, వారి మార్గాన్ని అనుసరించే తర్వాత తాళ్ళపాక కవులు దానికొక సమగ్రమైన సుస్వరూపాన్ని ఆవిష్కరించారనీ తెలియగలదు.

కృష్ణమాచార్యుల నామసంకీర్తనలగాన మొక్క సంహోచలంలోనే గాక వాని ప్రచారాన్నిబట్టి ఆనాడు ప్రసిద్ధములైన వైష్ణవాలయాలన్నిటిలోనూ సాగుతూవుండేదని తోస్తుంది. తిరుమలమీద శ్రీవెంకటేశ్వరుల సన్నిధినిగూడ కృష్ణమాచార్యుల సంకీర్తనలు గానం చేయబడుతుండినవి కాబోలును— స్వామివారే అన్నమాచార్యులతో ఇలా చెప్పుకొన్నాడట—

"ఆడుచు పతకమాకన్నల (లు?) జోలపాడంగ నాఁడెల్ల :
బసిబిడ్డనైతి

నా కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి— నాకర్ణించు నాఁళ్ళు
విరక్తుడనైతి

జగతినే శృంగార సంకీర్తనముల కనపడి మంచి ప్రాయపు
వాడనైతి"

(అన్నమా. చ. ద్విపద. పుట 41)

ఇందులోని 'పతకమా కన్నల జోల' అహోబలేశుని నాట్య వినోదులైన పాతకమూరి సోదరులు పాడిన జోలనే ప్రస్తావిస్తూన్నదనుకొంటాను. కాని ప్రసిద్ధమైన ఆ జోలపాటను గూర్చిగాని, ఆసోదరులార్గురి రచనలను గూర్చిగాని మనకేమీ తెలియడంలేదు మిగిలినవి మనకు తెలిసినవే. పోతే అవి వింటూ స్వామి పసిబిడ్డడై, విరక్తుడై, మంచి ప్రాయపువాడైన క్రమాన్ని బట్టీ, కాలక్రమాన్ని బట్టీ కూడా మన వాఙ్మయాన కలిగిన వికాసము పుష్టి వెల్లడి అవుతూనే వున్నది కదా!

దురదృష్టమేమోగానీ కృష్ణమాచార్యుల "చాతుర్లక్ష సంకీర్తనలు" ఈనాడు పూర్తిగా వ్యవహారం నుండి నశించిపోయినవి. మిగిలినవైనా శిథిలాతి శిథిలములై చెదరిపోయి రూపు చెడి వున్నవి. సత్యమేమిటో గానీ దీనికి తార్కాణగా కారణాంతరమున సింహాచల స్వామివారి ఆలయం మ్లేచ్ఛులచేత భగ్నమయేట్లుగా కృష్ణమాచా చార్యులు శపించినట్లూ, దానికి ప్రతిగా స్వామివారు కృష్ణమాచార్యుల రచనలన్నీ క్షుద్రములై రూపుచెడి నశించేటట్లుగా ప్రతిశాప శాప మిచ్చినట్లూగల కథ ఒకటి ఆచార్య సూక్తిముక్తావళిలో కానవస్తుంది.

ఈ పద్ధతినే తర్వాత తాళ్ళపాక అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యుడూ చేబట్టి రాగతాళ నిర్దేశంతో తాళగంధి చూర్ణకాలుగా వైరాగ్య వచనమాలికా గీతాలనే పేర (శ్రీ) వెంకటేశ్వర వచనాలను రచించాడు. వాటిలో మూట అరవై యారు మాత్రం నేటికి లభ్యములై ప్రకటితములైనవి. వాటిల్లో తాళ్ళపాక వారే రాగిరేకుల్లో చెక్కించిన వాటిలో నలభై యేడింటికి మాత్రం రాగతాళముల నిర్దేశం కానవస్తుంది. దేశాక్షి, ధన్యాసి, పాడి, భోపాలం, మలహరి, సాళంగనాట వంటి రాగాలు వీరి వచన మాలికా గీతాల్లో ఎక్కువ ప్రయుక్తమైనట్లు తెలియగలదు (చివరనున్న పట్టిక చూడదగును).

రచనారీతిలోనే కాక భావనలోనూ పలుకుబడిలోనూ కూడా కృష్ణమాచార్యుల రచనలకి తాళపాక్కవారి రచనలకి ఎంతోసామ్యం ఉన్నది. ఇందాక ఉదాహరించిన కోమటి చిన్నవాని కథలోనే చివర "దేవా అతని ప్రాణవాయువు లిచ్చేవో యియ్యవో యనిన అతని ప్రాణవాయువు లియ్యకున్నను జూచి దేవా మీరు శబరి యెంగిలి దిన్నది చెప్పుదునో... ధేనుకాసుర సోమకాసుర కంసాసుర

లిందులోపల అపశబ్దంబులు భాషించినవి చెప్పదునో... అని స్వామి వారిని కృష్ణమాచార్యు లదలించినట్లే తాళ్ళపాక వారూ శ్రీహరిని తమ మాటకాదంటే రేపల్లెలో వెన్నలు ముచ్చిలించిన వైనము, చేసిన చీకటి తప్పులు, బోయెదాని యెంగిలిదిన్న సంగతి, బలిచక్రవర్తిని చిరిసిన విషయము వెల్లడిచేస్తామని బెదిరించిన పాటలున్నవి. వారి వీరి రచల్లోని సాన్నిహిత్యమంత గాఢమైనది కాబట్టే ఆ వైష్ణవ కవుల రచనలు కథలు మహిమలు కొన్ని తరువాతి కాలంలో మారుపడి నాయూ అని కూడా అనిపిస్తుంది. తాళ్ళపాక పెదతిరుమలాచార్యు నిదిగా రాగిరేకుల్లో చెక్కబడిన "దేవనారాయణా! పరబ్రహ్మ స్వరూపా! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా" (అచ్చుప్రతి 51 వచనం) అనే వచనం యథాతథంగా కొద్దిభేదంతో మకుటంమారి కృష్ణమాచార్యుల వచనంగా తంజావూరు తాళప్రతిలో (అచ్చు ప్రతి 7 వ వచనం) ఉన్నది. పోనీ దీన్ని చూంచే లిరుమలయ్య మార్చి వ్రాసుకొన్నా డనుకొందాము. మహిమలు సరేసరి భక్తులందరి జీవితాలూ ఒకే మూసలో పోసినట్లే ఉంటాయి. ఉన్నాయికూడాను. మరి క్రీ. 16 వ శతాబ్దికి తరువాతి వాడైన ఏకామ్రనాథుని ప్రతాప చరిత్రలో కథనం కృష్ణమాచార్యులు రాగిరేకులు చెక్కించినవిషయం యథార్థమేనా అని! అయితే ఆయనివి ఒక్క రేకూ మనకు మిగల లేదా! అనవచ్చిందేమిటంటే తాళ్ళపాకవారి రాగిరేకుల కథను గాని ఏకామ్రనాథుడు పొరపాటున కృష్ణమాచార్యులకు ముడిబెట్ట లేదు కదా అని!

# నిబంధపదాలు - పదకవితా పద్ధతి

ఆంధ్రదేశంలో ప్రాచీనమైన వృత్తపద, అనిబంధపద రచనారీతులొక ప్రక్కన ప్రచారానికి వస్తూండగా, మరియొక వంకన భాషా వ్యుత్పత్తి, సంగీత పరిజ్ఞానము గల శిష్టులైన వాగ్గేయకారులు కొందరు అంతకుపూర్వమున్న దేశిగేయ రచనా రీతుల నాకళించుకొని 'సంకీర్తనా పరిశుద్ధిన్ మును చేయబూని' లక్ష్యలక్షణ సమన్వయ దృష్టితో నిబంధ పదకవితా పద్ధతికి కూడా చక్కని ప్రాతిపదిక కల్పించారు. వారిలో క్రీ॥ పదిహేనవ శతాబ్ది మధ్యభాగం నుంచీ లక్షణశుద్ధిగల నిబంధ కవితలతో దేశాన్ని ఉర్రూతలూగించిన తాళ్ళపాక కవులే ప్రముఖులూ ప్రథమాచార్యులు అనవలసివున్నది. వారి కంటె పూర్వమిలాటి పదకవితలు దేశీయతా ముద్రకలిగి జానపదుల వాగ్వ్యవహారంలోగాని లక్షణశుద్ధికలిగ శిష్టసాహిత్యంలో చేర్చదగినవీ, కాలము కర్తృత్వము గుర్తింపగలుగునవీ అధికంగా లేవనే చెప్పాలి. నాచనసోమనదని చెప్పబడే "వీణాగానము వెన్నెలతేటా" అనే బాజరపాట, గార్లపాటి లక్ష్మయ్యగారిదని ఈ మధ్య తలపబడుతున్న ఏగంటివారి పదాలలోని "శివశివ యన మేలు తుమ్మెదా" అన్న తుమ్మెదపదము, "సూర్య సోమావహ్నినడుమా శౌర్యమానే చిలుకాగంటీ" అనే ఏలపదము కొన్ని మాత్రమే అలాటివి కనిపిస్తున్నవి. వీటిల్లో ఏగంటివారి పదాల రచనా కాలం విషయంలో విమర్శకులలో అభిప్రాయభేదం లేకపోలేదు. శ్రీ మల్లంపల్లి శరభయ్యగారు 'ఏగంటి గ్రామమున వెలసిన నంజేశ్వరున కంకితములు'గా

ఏగంటివారి వచనములను శైవవేదాంత ప్రతిపాదకములైన గేయములు' రచించిన లక్ష్మయ్యగారు (ఏగంటి లక్ష్మయ్యాయు, పిడుపర్తి లక్ష్మయ్యాయు కారనియు) 'పోసెట్టి లింగకవిచేత నవచోళ చరిత్ర ప్రస్తావనలో నాదిమశివ కవిస్తుతిలో పాల్కురికి సోమనాథుని పిమ్మట, సుప్రసిద్ధ గేయ రచయితగా స్తుతియింపబడిన గార్లపాటి లక్ష్మయ్యగారే'యనియు వివరించారు. కాని ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర రచించిన శ్రీ రజనీకాంతరావుగారు ఏగంటి వారినిగూర్చి వ్రాస్తూ వారు 'తాళ్ళపాక వారికి సమీప కాలంలోని వారనిగాని, తరువాతి వారనిగాని అనడానికి ఇబ్బంది వుండదు. తాళ్ళపాక వారిలో పదకర్తలలో మూడవవాడైన చినతిరుమలాచార్యులు 16వ శతాబ్ది చివరివరకూ ఉండినవాడే. యాగంటివారు వీరబ్రహ్మంగారూ కూడా ఆ కాలంలోగాని, 17వ శతాబ్ది మొదటి భాగంలో పుట్టి మధ్య భాగంవరకూ ఉండినవారనిగానీ చెప్పుకోవచ్చు. వీరబ్రహ్మంకంటె అన్యులైన యాగంటి గురుడెవ్వరో మరొక వ్యక్తిగాని, తాళ్ళపాక వారివలె వరుసగా కొందరు తత్త్వకర్తలుగాని ఉండి ఉండాలి' అని అభిప్రాయం వెలిబుచ్చారు. ఏమైనా ఏగంటి సిద్దప్ప, సిద్దయ్యనామకులు కొందరు భిన్నులు కూడా వున్నట్లు తెలియడంచేత ఏగంటి వారు ఒక్కరు కాక పరంపరగా ఉండినట్లే తలపవలసివుంటుంది. యాగంటి లింగని సంబోధించి పలలు పాడిన లక్ష్మప్పగారే గార్లపాటి లక్ష్మప్పగారై ఉండవచ్చును. బహుశః సిద్ధనంజేశకవి తన 'గురు రాజ చరిత్ర'లో కన్నడ పదకవిగా పేర్కొన్న లక్ష్మాభక్తుడితడే నేమో! ఈ లక్ష్మాభక్తుడు గార్లదిన్నె (అనంతపురం జిల్లా) వాస్తవ్యుడనీ, పాంచాళ (కమసాలి) వృత్తిగలవాడనీ, తత్వజ్ఞాని అనీ, క్షేత్రాటనంచేస్తూ శివాధిక్యాన్ని స్థాపిస్తూ రాయచోటి (కడప జిల్లా)లో కొంత కాలముండి గంగాధరుడనే శైవరాజుని వీరశైవునిగా మార్చాడనీ, ఆ సందర్భంలోనే అతడు వైష్ణవాచార్యుడైన అన్న

మాచార్యులను కలుసుకొన్నాడని, లక్ష్మాభక్తుని పాటలలో శృంగారరసం లేదని అన్నమాచార్యులు ప్రస్తావించి విమర్శింపగా అన్నమయ్యగారి శృంగార సంకీర్తనలను తడవి 'తన తలిదండ్రుల శృంగారాన్ని వివరించేవాడు సత్పుత్రుడు కా'డని లక్ష్మాభక్తుడు ప్రతి విమర్శ చేశాడనీ, తర్వాత తిరుపతి తిమ్మప్పచేతనే శివాధిక్యాన్ని పలికించాడనీ జనశ్రుతిలో వున్న కథనొకదాన్ని 'శివదాస గీతాంజలి' గ్రంథపీఠికలో కన్నడ విద్వాంసులు శ్రీ బసవరాజుగారుదాహరించిన విషయాన్ని పూజ్యులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు (అన్నమాచార్య కీర్తనలు 19వ సంపుటం పీఠికలో) వివరించారు.

వీటినిబట్టి గార్లపాటి లక్ష్మప్పగారూ, గార్లదిన్నెవాసి అయిన లక్ష్మాభక్తుడూ ఒకరే కావచ్చుననీ, 'యాగంటి గురువు'గా ప్రస్తుతుడైన ఈ లక్ష్మప్పగారే తాళ్ళపాక అన్నమాచార్యులకు సమకాలికులనీ తలపవలసి వుంటుంది. కాని యాగంటి గురుడైన లక్ష్మప్పగారు సాలెకులంవాడనీ 17వ శతాబ్ది మధ్య భాగంలో వుండిన వీరబ్రహ్మంగారి శిష్యుడనీ చెప్పే కథలు కూడా జనశ్రుతిలో వున్నవి. వివరాలు స్పష్టంగా తెలియవచ్చేవరకూ లక్ష్మప్పగారు అన్నమాచార్యుల చివరి రోజులలోగానీ పెదతిరుమలాచార్యుల కాలంలోగానీ ఉండి వుంటారనుకోవచ్చు.

యాగంటివారి పదాలుగా ప్రసిద్ధి చెందిన

"ఓపితే పుణ్యముసేయు మోపకుంటే ఊరకుండుము
పాపము సేయకు మింతే పదివేలు జీవుడా"

"పొరలి సంసారమ్ము బొరయకుండెడి
యరసి కోర్కెలయందు నంటబోడు."

మొదలైన లక్షణశుద్ధిగల పదాలను రచించినవారు మాత్రం తాళ్ళ పాకవారి రచనల నెరిగి యుండినవారుగానే అనిపిస్తారు. వారి పదాల లోని రచనానిర్మితి పదప్రయోగసరళి నాకలాటి ఊహను కల్గిస్తున్నవి. ఇంకో మాట! తాళ్ళపాకవారే తమ సంకీర్తనచ్ఛాయాపహారులను తెగడినారు కదా!

"వెఱ్ఱులాల మీకు వేడుక కలిగినేను
అఱ్ఱువంచి తడుకల్లంగరాదా"

"ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల
అమరంగ ఛాయాపహారము చేసుక
తమమాట గూర్చితే దైవము నగడా"
చిబికివేసిన గింజ చేతబట్టగ నేల
గబుక కెంగిలి బూరె గడుగంగమతియేల
తొబుక కవిత్వాల దోషాల బొరలితే
దిబుకార నవ్వడా దేవుడైనాను"
ఎన్నగ (శ్రీ) వేంకటేశుడాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ
ఉన్నతితోడాడి రొకడెవ్వడో తాను
సన్నొరసునట సమ్మతాహారికి" (10)

(ఈ కీర్తనం అన్నమాచార్యుని రచనగా ఆధ్యాత్మ సంకీర్తనల సంపుటాలలో ముద్రితమైనదిగాని అన్నమయ్యను భూతకాలిక క్రియా రూపంతో పేర్కొన్న యీ రచన నాకేమో పెదతిరుమలాచార్యుని దేమో అనిపిస్తుంది.) ఇది ఎవరినిగూర్చి వ్రాసిందై వుంటుంది?

"వీరశైవాచార విభవము మదిలోన
గోరక శివుని గొలుపు నేరక
వేరొక్క మతమున విహరించు హీనుల
జేరంగ నేగంటి సిద్దయ్య నగెబో"

అనే రీతిని సాగిన 'యాగంటివారి' పదాలను స్మరించి తిరస్కరించిన దేనా పై సంకీర్తనము అనిపిస్తుంది. 'సిద్దయ్య నగెబో' అని వారంటే దైవము నగడా?' అని వీరు తిరిగి ప్రశ్నించినట్లుంది! ఏమో! కాక పోతే వారి సన్నిహిత కాలంలో వర్తిల్లి, వారివలెనే పదకవితల్లిఁ వారి ఆగ్రహానికిలా పాల్పడిన తెలుగు పదకర్తలు వేరెవ్వరై వుంటారు? పైన ఉదాహరించిన కథలనుబట్టీ, దేశకాలాల్లో వారికున్న సామీప్యాన్ని బట్టీ తాళ్ళపాకవారి సంకీర్తనచ్ఛాయాపహారు లాతరు వాతి 'యాగంటి'వారే అనుకోవచ్చు.

ఏమైనా తెలుగులో వినూత్నమైన ఈ నిబంధపదకవితా ప్రక్రియకు సురూపాన్ని కల్పించడంలో తాళ్ళపాకవారే ఆద్యులనీ, వారికి ఆ విషయంలో అంతకు పూర్వపు సంస్కృత కర్ణాటకాది భాషల్లోని వాగ్గేయకారుల రచనలు చాలవఱకు దోహదమిచ్చి వుంటా యనీ అనడంలో సందేహంలేదు. తాళ్ళపాకవారే తమ సంకీర్తన లక్షణంలో జయదేవుని గీతగోవిందాన్ని స్మరించారు గదా!

అందులోని అష్టపదుల్ని పోలిన రచనలెన్నో తాళ్ళపాక వారివి సంస్కృతాంధ్ర భాషల్లో వున్నవి కూడాను పోతే కన్నడ భాషలోని ప్రాచీన గేయాలను గూర్చి కర్ణాటక సారస్వతంలో వీర శైవయుగానికి చెందిన నిజగుణశివయోగి, బసవేశ్వరుడు మొదలైన వారు గానించిన భక్తిజ్ఞాన వైరాగ్య బోధకములగు గేయాత్మక రచనలు వందలకొలదిగా వున్నవి. వాటికి గమక కళాకోవిదులు అందంగా ఆలపించే సంప్రదాయము నేటికీ కన్నడదేశంలో వుంది.

ఈ కృతుల్ని శాస్త్రములనే పేరుతోనే వీరశైవ విద్వాంసులు వ్యవహరిస్తారు. ఇవి ప్రాయికంగా అనిబంధ పదకవితా శాఖకి చెందిన వచన సంకీర్తన పద్ధతికే చేరిన రచనలనవచ్చు ప్రాచీనములైన ఈ కర్ణాటక శైవ వచన గీతాలే మనవారి వచన సంకీర్తనలకు మూల ప్రాయములైన రచనలు. అటు తర్వాత దాససాహిత్యము మధ్వాచార్యపరంపరకు చెందిన నరహరి తీర్థులు, శ్రీపాదరాయరు ప్రభృతులు కూడా సంకీర్తన పదరచనలు గావించినవారే. వారి రచనలు అన్నమాచార్యులు నిర్వచించి చెప్పకొన్న పదరచలకు దోహదం చేసివుంటాయని అనుకోవచ్చు. వీరిలో నరహరితీర్థులు పూర్వులే గాని శ్రీపాద రాయరు మాత్రం వయసున కొంత పెద్దవారైనా అన్నమాచార్యునికి సమకాలికులే. ఇకఅటు తర్వాత కన్నడ పదరచనలో విశిష్టత గడించుకొన్న వ్యాసరాయ పురందర దాసాదులు సమకాలికులే అయినా పదరచనా విషయంలో అన్నమయ్యకు తరువాతివారే అనవచ్చు. ఇటు చూడగా ఆంధ్ర కర్ణాటక సాహిత్యాలలో కొంచెమెచ్చు తగ్గుగా సమకాలంలోనే లక్షణసిద్ధిగల పదరచనకు, సంగీత సంప్రదాయానికి పునాదులు పడ్డాయేమో అనిపిస్తుంది. తెలుగున అన్నమాచార్యులు పద కవితా పితామహుడనిపించుకొన్నట్లే కర్ణాటకమున అంతకు పూర్వవు పదకవులొకరిద్దరున్నా పురందరదాసే ఆ స్థానాన్ని అలంకరించారు. తాళ్ళపాక వారి పదరచనలు "ఆంధ్ర వేదాంత" మనిపించుకొంటే పురందర దాసుల రచనలు 'పురందరోపనిషత్తు' లని పించుకొన్నని. తాళ్ళపాక వాగ్గేయకారులు 'భువిహరిదాసుల' మనీ, 'దాసవర్గ' మనీ తమున్ము దాము వర్ణించుకొని "హరిదాస కూటము"ను నిర్వహిస్తే, పురందర దాసాదులు "దాసకూటము" ను నిర్వహించారు. వైష్ణవమతములు కూటములు, జ్ఞానబోధకి తోడుపడగా 'హరిదాసకూటము' దేశంలో భక్తి మత ప్రచారానికి పూనుకొన్నవి. అదే పనిని ద్వైత సంప్ర

దాయాన్ని అనుసరించి వ్యాసకూట దాసకూటముల వారూ నిర్వ హించారు.

**హరిదాసకూటము-దాసకూటము**

రామానుజుల వారి విశిష్టా ద్వైత మత సంప్రదాయానికీ, మధ్వాచార్యుల ద్వైత సంప్రదాయానికీ సూక్ష్మమైన తాత్త్వికాంశాలలోనే తప్ప స్థూలమైన హరిభక్తి విషయంలో మాత్రం ఎలాటి భేదములేదు. రెండు సంప్రదాయాలూ జీవాత్మ పరమాత్మల భేద భావాన్ని అంగీకరించి భక్తిభావానికి పట్టము గట్టినవే. కాబట్టి జన సామాన్యంలో హరిభక్తి వ్యాప్తికి దెచ్చి, మధురమైన భక్తిగేయ సారస్వతం చేత దేశాన్ని రసప్లావితంలో చేయడంలో ఆనాడే హరి దాస దాసకూటాలు రెండూ కలిసి మెలసి వ్యవహరించినవనే విశ్వ సించవచ్చు. ఈ రెండు కూటాలకీ మూలపురుషులనదగిన మహా నీయులు అన్నమాచార్య వ్యాసతీర్థవరేణ్యు లిరువురూ సమకాలికులే. సాళ్వనరసింహరాయని చేత సత్కరింప బడినవారే. ఆ తర్వాత ఆ కూటాలకు మూలస్తంభాలనదగిన వారిలో పెదతిరుమలాచార్య చిన తిరుమలాచార్యులు, పురందరదాస కనకదాసులు ఉన్నారు వీరందరూ ఆనాటి విజయనగర ప్రభువుల ఔదార్యాన్ని ఊతగా గొని మతసాహిత్య కళా రంగాలలో గణనీయమైన సేవచేశారు. ఈ కాలంలోనే కేవల పదకవితలకే కాక మన దాక్షిణాత్య సంగీత సంప్రదాయానికి కూడా చక్కని పునాదు లేర్పడ్డాయి. ఈ భావానికి క్రింద చూపుతున్న ఉపపత్తులే కారణం.

1. వృద్ధుడు, పదకవితా పితామహుడు అయిన అన్నమాచార్యులు పురందరదాసులకు వయసున చిన్నవారైనా ఘనంగా సంభావించి కీర్తించారు (చూ. అన్నమా. చ. ద్విపద పు 44)

2. తాళ్ళపాకవారూ, పురందర దాసాదులూ భక్తిమత ప్రచారానికి భజనకూటాలు నిర్వహించారు. ఉభయ కూటాలవారు తిరుమల మీదను, విద్యానగరమందు భజనకూటాలను నడిపి శ్రీని వాసునిమీద భక్తిగేయాల నాలపించారు. పాండురంగ విఠలునిమీద పదులకొలదిగా పదాలు చెప్పారు. ఆంజనేయస్వామి నారాధించారు

3. తాళ్ళపాకవారి పదరచనలకి, పురందరదాసాదుల కీర్తన లకి భావంలోను, పదప్రయోగంలోనూ మాత్రమే కాక పదకవితా రీతిలోనూ, వైవిధ్యంలోనూ కూడా ఎంతో సామ్యమున్నది. దీనికా భజన పరుల సాన్నిహిత్యమే కారణం అనుకోవచ్చు.

4. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, పురందరదాసాదులూ అచ్యుత దేవరాయలవారిచేత ఆదరింపబడి వారికభీష్టంగా స్వామి వారి కంకితముగా సంకీర్తనలు చెప్పినవారే. తాళ్ళపాక వారి సంకీర్తన భండాగార వ్యవస్థని సుస్థిరపరచి రాగిరేకులపై వారి పదాల నన్నిటిని చెక్కించి భద్రపరచడానికి తగిన అవకాశం కల్పిం చింది అచ్యుత దేవరాయలే. శ్రీ కృష్ణదేవరాయల తర్వాత వ్యాస దాస కూటాలకు అచ్యుతదేవరాయలు ఆయన లేని కొరతను తీర్చిన వాడే. ఆయన ఆస్థానంలోని సంగీత విద్వాంసుడు తోడరమల్లు బిరు దాంకితుడు అయిన బయకార రామామాత్యుడు నాటి సంగీత ప్రపంచాన్ని ఉత్తేజ పరచినవాడే. తాళ్ళపాక చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో తోడరమల్లుని స్మరించాడు.

5. నాటి వాగ్గేయకారుల సంకీర్తన కాలంలో భిన్న ప్రదేశాలలో ప్రచారాన్ని కల్పించడానికై స్వర సాహిత్యాలతో వాటిని నేర్పడానికి, ప్రాచుర్యం చడానికి అచ్యుత రాయల కాలంలో గొప్ప కృషి జరిగింది. దానిఫలితమే తాళ్ళపాక వారి సంకీర్తన భండాగారవ్యవస్థ. మంగళగిరి, సింహాచలం మున్నగు

చోట్లగల వైష్ణవాలయాల్లో పెక్కింట ఆనాడు సంకీర్తన వాఙ్మ్యాజలు జరుగుతుండినవి. ఆ దృష్టితో సంగీతాభ్యాసానికి శిక్షణకి నాదవసరమేర్పడింది. అప్పటికే ప్రత్యేకత గడించుకొంటున్న దాక్షిణాత్య సంగీత పద్ధతికి నామరూపాలు దిద్దడానికి కృషి జరిగింది. పురందర దాసు సంగీత విద్యాభ్యాసానికి తగురీతిని సరళ జంటవరుసలను, బహువిధగీతాలంకారాదులను రచించెను. సంకీర్తన భండాగారంలో సంగీత విద్వాంసు లుండేవారు. వారు పాడేవారు. అర్థులకు నేర్పేవారు. "పాటలెల్లా పాడుకుంటూ భూమికెల్ల నోరనూరి పోసినా" రట—తాళ్ళపాక నరసింగన్న 'పాడఁజెప్పను వర్ణపద్ధతి నీడుజోడు లేడన సభఁజొచ్చి వాదించి పరగిన ధీశాలి'ట సంగీత విద్యాభ్యాస తప్పరులు అప్పటికే పురందర దాసులవారు రచించారనుకొనే అలంకారాదులు నేర్చేవారు.

"సరిగమపదనిస సనిధపమగరి
సరిగమరిగమప సనిధపమనుచు
బహువిధాలంకృతుల్ పాడుగొల్పి.........

గ్రామ సంతతుల మేళముల్ చేసి...ఆలాప మార్గమును జూపుచు" ప్రారంభకులు పాడుకొనుచుండినట్లు చిన్నన్న ఉషా కళ్యాణంలో వివరించినాడు.

'జోడు గూడి గురుశిష్యులిరువురును ఆ వృత్తి చేయుచు తద్దివ్య ప్రబంధనివహంబులెల్ల తాళమానితముగా, పాడుకోడాన్ని చిన్నన్న యే పరమయోగి విలాసంలో వర్ణిస్తాడు తాళ్ళపాకవారే స్వరసాహిత్యాలతోగూడిన తమ సంకీర్తనలను (రాగి రేకులపై చెక్కించడానికి అనువుగాక కాబోలును) నిలువెత్తు శిలాశాసనాలుగా లక్ష్యలక్షణ సమన్వయంతో చెక్కించుకొన్నారు. ఆలయప్రాకార కుడ్యాలలో నిలిపి స్వామి సందర్శనానికి వచ్చే నారందరూ వాటిని

చూచి నేర్చుకొనే భాగ్యం కల్పించడానికే బారట్టి ప్రయత్నం చేశారేమో అనిపిస్తుంది.

చిన తిరుమలాచార్యులు తాతగారి సంకీర్తన గ్రంథాన్ని తెలిగించాడు. బయకార రామామాత్యుడు అచ్యుతదేవరాయలకు తోడుగావున్న అరవీటి రామరాయల కభీష్టంగా 'స్వరమేళకళానిధి' ని రచించాడు. పురందరదాసు సరళి జంట వరుసలకి, లక్షణ గీతాలకి, ఎన్నుకొన్న మాయామాళవగౌళ మేళం యొక్క ప్రాశస్త్యమునే రామామాత్యుడు అందులో ఉగ్గడించాడు. ఒక్క సంగీతానికే కాదు, అచ్యుతదేవరాయలు సంకీర్తన విద్యకు తోడుగా నాట్య విద్యను గురించి కూడా శ్రద్ధతీసుకొన్నాడు. విద్వత్సభరాయ రంజకురాంద్రని ప్రసిద్ధిగాంచిన ముద్దుకుప్పాయి, హనుమసాని, మొదలైన నట్టువ కత్తెలను అతడు రాజధాని నుండి సంగీత నృత్య విద్యోపదేశానికై తిరుపతి ఆలయానికి చేర్పించాడు.

పై పరిశీలనాన్నిబట్టి అచ్యుతదేవరాయలు, అళియరామరాయలు, వారినసుసరించి తాళ్ళపాకవారు, పురందరదాసులవారు, బయకార రామామాత్యులు అందరూ కలిసి మనమీనాడు అనుకొంటున్న కర్ణాటక సంగీత పద్ధతికి ఆనాడే పట్టాభిషేకము కావించినట్లున్నారు. కాని స్వరసాహిత్యాలతో నుండిన అప్పటి వాగ్గేయకారుల పదాలు-పాటతీరు ఈనాడు మనకు కనుమరుగై పోవడానికి ఆతర్వాత జరిగిన విద్యానగర వినాశనమే ప్రధాన కారణమైయుంటుంది. శిలాబద్ధమై తాళ్ళపాకవారి కీర్తన లొకటి రెండు, ఎట్లాగో సుబ్బరామదీక్షితులవారికి చిక్కి సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ఉదాహృతములైనవి. పురందరదాసులవారి కీర్తనలు కొన్ని, కర్తృత్వం తెలియకున్నా ప్రాచీన రచనలని ఆయనే ఉద్ధరించిన కీర్తనలు మరికొన్ని రూపు చెడకుండా స్వరసహితంగా నేటిక

మనకు ఆయన గ్రంథంలో లభిస్తున్నవి. ఆనాటి సంగీత సంపద నేటికి మనకి లభించిందంతే!

6. క్రీ. శ. 1540 ప్రాంతంలో చినతిరుమలాచార్యులు పునర్నిర్మించిన అలమేల్మంగాపుర గోపుర ప్రాకారమంటప శిలాస్తంభ కుడ్యాలందెక్కడబట్టితే అక్కడ నాటి వాగ్గేయకారుల వ్యక్తిత్వాన్ని వెల్లడించే శిల్పాలెన్నో వున్నవి. చినతిరుమలయ్య అక్కడి ఆలయంలో పదకవితా పితామహుని శిలామూర్తినే ప్రతిష్ఠాపించాడు కూడాను.

ఇట్లా పైన వివరించిన హేతువుల్ని పురస్కరించుకొని అచ్యుత దేవరాయలవారి కాలంలో, వారి ప్రోత్సాహంతో, ప్రచార దృష్టితో, ఈ హరిదాస దాసకూటాలు రెండూ ఏకముఖమై కళా రంగాన పరిశ్రమించినవనడం విస్పష్టమే. నాటి వైష్ణవాలయాలే-ముఖ్యంగా తిరుమలమీది శ్రీనివాసాలయమే-కళానిలయమై కళా కేంద్రమై వర్ధిల్లింది. ఉదారులైన ప్రభువుల, సమర్థులైన వాగ్గేయకారుల, లక్షణజ్ఞులైన విద్వాంసుల, కుశలులైన కళాకారుల ప్రాపున నాటి కళాలత చక్కగా చిక్కగా దేశమంతా అల్లుకుని మూడు పువ్వులు ఆరుకాయలునై వర్ధిల్లినవి.

**తాళ్ళపాక సంకీర్తన పదకవిత్రయము**

తెలుగున శిష్టమైన మార్గకవితకు శ్రీకారంచుట్టి (కృతి రచనా) 'భారత కవిత్రయం' ప్రఖ్యాతి వహించింది. శుద్ధమైన కర్ణాటక సంగీత పద్ధతికీ రూపుదిద్ది స్వరాలంకారాలుకూర్చి దక్షిణాంధ్ర యుగంలో సంగీత మూర్తిత్రయం స్తవనీయమైంది. ఆ రెంటికీ నడుమ మధ్య యుగంలో సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్యమిచ్చే నిబంధపద కవితా పద్ధతిని పుట్టించి పోషించి నిలిపిన విఖ్యాతి తాళ్ళ

పాక పదకవిత్రయానికే దక్కింది. ఈ పదకవిత్రయంవారే అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులును.

**అన్నమాచార్యులు**

(క్రీ. శ. 1424-1503) తాళ్ళపాక వంశ విఖ్యాతికి మూల పురుషుడు అన్నమాచార్యులు. సంగీత సాహిత్యాలలో గొప్ప పాండిత్యము. సంస్కృతాంధ్రాలలో మంచి కవితా పుష్టికలవాడు. పరమ భక్తుడు. 'హరికీర్తనాచార్యు'డనీ, 'పదకవితా పితామహు'డనీ 'పంచమాగమ సార్వభౌము'డనీ కీర్తింపబడ్డవాడు. ద్రావిడ వేదాన్ని తెనుగు చేసినవాడు. వైష్ణవ కావ్యాలను, శతకాలను, క్షేత్రమహాత్మ్యలను మాత్రమే కాకుండా భక్తిమత ప్రచారానికై నూతనంగా తెనుగున పదకవితకు పూసుకొన్నవాడు. పదహారేండ్ల పసి ప్రాయంలోనే స్వామి యాదేశానుసారం సంకీర్తన రచన కారంభించి తన జీవిత కాలంలో మొత్తం ముప్ఫయిరెండు వేలకుపైగా తిరువేంగళనాధ దేవునిపేర శృంగార ఆధ్యాత్మరీతుల్లో పదాలు సా...

ప్రతివాట వైష్ణవ తత్త్వాను ముల్లిగట్టిన ముత్యా...

మూట. ఈయన రచనలు-

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీథులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకట శైలవల్లభరతి క్రీడా రహస్యంబులై
నుతులై తాళ్ళపాక యన్నయవచో నూత్న క్రియల్ చెన్నగున్"

అని పొగడ్త గాంచినవి.

ఈ మహనీయుని పవిత్ర జీవిత చరిత్ర చిన్నన్న వ్రాసిన ద్విపద గ్రంథంవల్ల మనకు తెలియవచ్చింది. దాన్ని అనుసరించే చారిత్రికమైన ఆ సంకీర్తనాచార్యుని జీవిత విశేషాలను సంగ్రహంగా మనవి చేస్తాను

అన్నమాచార్యుడు నందవరీక బ్రాహ్మణుడు, ఋగ్వేది, ఆశ్వలాయన సూత్రుడు, భరద్వాజసగోత్రుడు, అయిన నారాయణ సూరికి అతని ధర్మపత్ని లక్కమాంబకు శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంచేత "బిరుదు గజ్జియల మువ్వడి కదారంబగు నందాకాంశ మున - వైశాఖ విశాఖానక్షత్రమున- చక్కని గ్రహములుచ్చమున మూడలర" పుట్టినాడు. వైష్ణవ పుణ్యపురుషులైన పన్నిద్దరాళ్వారు లలో నమ్మాళ్వారు కూడా వైశాఖ విశాఖనే జన్మించినట్లు సంప్రదాయజ్ఞులు చెబుతారు. ఈయన అలాగే. వేంకటేశ్వరస్వామివారి గుడిఘంట అంశమున వేదాంతదేశికులవారు అవతరించినట్లే ఈయనా స్వామివారి నందకాంశమున అవతరించినట్లు విఖ్యాతి. పువ్వు పుట్ట గానే పరిమళిస్తుంది కదా! ఆజన్మ వాసన అలాగే ప్రవ్యక్తమైంది పసిబిడ్డడైనా ఆతడు శేషశైలేంద్రుమీది బాణినే పడియుండేవాడట. జోల పాడినా వేంకటపతి పేరు వివరించి పాట పొంకించకుంటేపోరు ఊరడిల్లేవాడుకాడట. ఉచితకాలాన తలిదండ్రులాతనికి జాతకర్మాదికం చేశారు. మరి పంచసమంబులైనంత నియతమై గురుడుపనీతు గావించి నయవేది నధ్యయనంబు సేయించెను-వెన్నుని వరంచేత ఆతనికి జిహ్వారంగసీమ విద్యలన్నీ తముదామె పొచ్చి నర్తనమాడదొడగే ఆప్రాయంలోనే ఆయన ఆడినమాటెల్ల అమృతకావ్యంగాను, పాడిన పాటెల్ల పరమగానంగానూ అయేవి.

చిన్ననాటి నుండి తల్లిదండ్రులు, అన్న, వదిన ఎవరే పని చెప్పినా విసుగులేక శ్రద్ధగా చేస్తూవుండేవాడు. ఒకసారి ఇలాగే పశువులకు గడ్డికోసుకు రమ్మని పంపిస్తే కొడవలి పెట్టి గడ్డికోస్తూ పరధ్యానంలో చెయికోసుకుని బాధపడి ఆకోత కన్నా వదినచేకోత మరింత భరింపరానిదని గుర్తుకొచ్చి "ఎన్నటి చుట్టంబు ఎటువంటి వాడ లెన్నటి బంధుండ నేనువారలకు-ఛీ రోత"అని యేవగించుకొని మరి యింటికిబోకుండా గోవింద గోవింద గోవింద అంటూ వెళ్ళే

పరుసల వెంట ఒంటరిగా ప్రయాణమై తిరుపతి చేరుకొన్నాడు. అక్కడ గ్రామంపుళక్తి గంగమ్మను దర్శించాడు. ఆపైన అళిపురి సింగరి నర్చించి 'తలియేరుగుండు' దర్శించి, పెద్దయెక్కుడు నెక్కి, 'కపురంపు గాలువ నడచి' చెప్పుకాళ్ళతోనే మోకాళ్ళ నుండువు చేర వచ్చి బడలి ఒక రాతిమీద సొమ్మసిలి పడిపోయాడు. అప్పుడలమేలు మంగ ప్రత్యక్షమై ఆ బాలుని సేదదేర్చి, కందర్పజనకుని గనే మార్గాన్ని సూచించి అంతర్హిత కాగా ఆ చిన్నవాడు స్వస్థహా వచ్చి మేలుకొంటాడు. కలనిజమని తెలుసుకొంటాడు. ఆ పద్మ తనకేల నిడిన ప్రసాదం కారణంగా పరమ సారస్వత పారీణుడై వరకవిత్వ వాచాప్రౌఢి మెరసి అలమేలుమంగాంబ చేర ఆశుమార్గాన ఒక శతకం చెప్పుతాడు. అదే మంగాంబికాశతకం. ఆ పైన అమ్మవారి ఆదే శాన్ననుసరించి సాలగ్రామమయమైన ఆ పర్వత పంక్తిని చెప్పులు లేకుండానే అధిరోహిస్తాడు. అట్లా శేషశైలాన్ని అధిరోహించి స్వామి పుష్కరిణి సోయగాని కబ్బురమంది, ఆదరినేవున్న ఆదివ రాహు నాదరంబున సేవించి, ప్రదక్షిణం చేసుకొనివచ్చి పెద్దగోపు రాన్ని దర్శించి నీడ దిరుగని బింతకడ నమ్రుడై, గరుడ గంబానికి సాగి మొక్కి, చంపక ప్రదక్షిణానికి వచ్చి, స్వామి పుష్కరిణిని పూజించి, తిరుమల్పనికి నివేదితమైన మీద అమ్మే ప్రసాదాలార గించి, నడగోపురం ప్రవేశించాడు. శ్రీనివాసునకు నమస్కరిం చాడు. దండమన్న బాష్యకారులను పొగడి, శ్రీ నరసింహుని సేవ గావించి, జనార్ధనుని సమ్మతించి, ఆలిమేలుమంగ కభివందనంచేసి, పెంగటి యాగశాలని కీర్తించి, ఆనందనిలయాన్ని దర్శించాడు. కళ్యాణమంటపానికి కరములు మొగిచి, చెంగటి తేజకెలగి బంగారు నగాసుని ఏకించి, శేషుని గొలిచి, సరుసలతోబాటు మొక్కులిడి. ముందారాన తన కొంగునున్న కాసు కానుకపెట్టి, బంగారుగాదెల స్వసాష్టాంగ మంగలింపుచు, పులకాంకితుడై బంగారు వాకీట నిల

బడి స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని కనుల కరువెల్లదీర సేవించుకొన్నాడు. 'కంటి నయ్యఖిలాండ కర్తనే నధికుగంటి నాయఘము నిక్కము వీడుకొంటి' అని అన్నమయ్య పరవశించి పాడుకొన్నాడు. ఆ పాటకి అచ్చటనందరూ మెచ్చి చనవిచ్చి, తీర్థప్రసాదాలిచ్చి, యెదజేర్చుకొని, శఠగోపమిడి దీవించి పంపారు. ఆ రీతిగా 'ఎనిమిదియేడుల పిన్నబాలు'డగు అన్నమయ్య ఆ రాత్రి అక్కడ గడిపాడు. మరునాడు దివ్యతీర్థాలకేగి కొమరధారను దర్శించి. హనుమంతుడి కీర్తించి, పాపవినాశనమును, పాండవనామాది దేవ తీర్థాలను సేవించి, అక్కడే అవగాహనమాడి ఉతికినబట్ట ఆరేలోగా ఏతతవృత్తంబుల వేంకటపతికి కుతుకంబుతో ఒక శతకాన్ని సమకూరజేసి దర్శనార్థం స్వామివారి ఆలయానికి వచ్చి తలుపులు బీగాలు వేసి వుండగా గుడిముందు నిలబడి తాను వెంకటపతిమీద వివరక్తముగా చెప్పిన వేంకట శతకాన్ని వినిపించగా తాళాలువీడి ఆలయపు తలుపులు తమంత తామె తెరుచుకున్నవి. ఆ వింతకు అర్చకుడాశ్చర్యపోయాడు. ఆ బాలకుని మెచ్చి వెంట బెట్టుకొనివెళ్ళి గరుడ శేషేశులను, కపిరాజముఖుని, జనకజా సౌమిత్రి సహితురాఘవుని కనిపించుకొని, నమస్కారాలుచేసి ముంగట పంచబేరాకృతిజాగ్రైన శ్రీ వేంకటేశుని సేవింపజేశాడు. లోపలనంబి ధూపనీరాజ నాదుల తోడి వైదికోపచారముల స్వామిని పూజిస్తుండగా అన్నమయ్య మళ్ళా తాను వెనుక చెప్పిన వెంకటశతకాన్ని విన్నవించుకొన్నాడు. ఈసారి పెట్టిన ముత్యాలపేరు ఆ యశోద పట్టి పాదాలపై పడేటట్లు ప్రసాదించాడు. ఆ వింతలు చూచి వైఖానసార్చకుడు అరుదంది మురిసిపోయి శఠగోపమిడి దీవించి ఆ నవ్యకావ్యాన్ని చెప్పిన బాలుని కీర్తించాడు. ఇది ఒక ద్వాదశినాడు జరిగింది. ఇట్లా ఆనాడు అన్నమయ్య స్వామిని సేవించుకొని ఒక పంచ తిన్నెపై నుండగా పున విష్ణుడనువాని వచ్చి తనకు స్వామి ఆ క్రిందటి రాత్రే-అంటే [illegible]

దశినాడన్న మాట -స్వప్నంలో అన్నమయ్య రాకనుగూర్చి తెలిపి పంచసంస్కారాలు చేసి రమ్మని ఆదేశించిన వైనం చెప్పి సుముద్రా ధారణమున శంఖచక్రాంకితుని చేసి అన్నమయ్యకు పంచసంస్కారాలు పూర్తి చేశాడు. శరణాగతి ధర్మాన్ని బోధించాడు. అన్నమయ్య వైష్ణవం స్వీకరించి వైష్ణవుడయ్యాడు. ఆచారపరులైన వైష్ణవులు అతణ్ణి స్వీకరించి సహపంక్తి భోజనం చేశారు.

అంతలో తల్లి వెదుకుకొంటూ వచ్చి కొండమీద అన్నమయ్యను కలుసుకొంటుంది. ఇంటికి రమ్మంటుంది. గురువు కూడా హితముపదేశిస్తాడు. మౌనివాక్యము త్రోయజాలక అన్నమయ్య తల్లితో ఇంటికి వెడతాడు. తల్లిదండ్రుల ప్రయత్నము స్వామివారి అనుగ్రహము ఫలించి ఎలజవ్వనమున వున్న అన్నమయ్య ఇద్దరు పడతులను పెండ్లి చేసుకొంటాడు. అందులో ఒక తిరువాలుగంటి తిరుమలమ్మ. మఱియొక కన్య అక్కలమ్మ. ఇట్లా వారిని ఆగమోక్తంగా పెండ్లాడిన తర్వాత 'సర్వతంత్ర స్వతంత్రుడైనట్టి వేదాంత దేశికు వేంకటాచార్యు నాదివ్య సాంప్రదాయమున వర్తించు శఠకోపముని వద్ద సకల వేదాంత పఠనంబు పూర్తి చేసుకొంటాడు. మంచి ప్రాయంలో వున్నప్పుడే వాల్మీకిరామాయణాన్ని జీర్ణించుకొని దాని నంతా సంకీర్తనాత్మకంగా ఆలపిస్తాడు. అన్నమాచార్యుని సంకీర్తన పద్ధతి జగన్మోహనమై ప్రఖ్యాతి కెక్కుతుంది. ఆతని హరిభక్తిని, సంకీర్తన రచనాశక్తిని, గానరక్తిని తలపోసి 'తుంబురుడో నారదుడో కాక యీ విధంబున దిరుగు గంధర్వుడో' అని ప్రజలు అరుదంది పోతారు. ఆ వార్తలు విని "ఆ చేర్వ టంగుటూర సుపురం బేలు రాచ మూకలలో బరాక్రమశాలి, నాళికా న్వయుడ జేయు" డగు సాళువ నరసింగ జనపాలుడు అన్నమయ్యని ఆశ్రయించి శ్రీకృష్ణుని మన్ననతో క్రీడి భూచక్ర మేలినట్లుగా తానూ అన్నమయ్య సహాయ ముంచే ధర యేలుదునని విన్నవించుకొంటాడు. తన వెంటవచ్చి వుండ

మని అర్థిస్తాడు. సహజ వైష్ణవ భక్తి సలిపేవారి సహవాసం దోషం కాదని తలచి అన్నమయ్య ఆతని కోరిక ననుమతిస్తాడు. ఆతడు భృత్యప్రాయుడై కొల్చిరాగా అన్నమయ్య టంగుటూరుచేరి, కేశవ స్వామిని దర్శించి, ఆ కోవెల సమీపాన తనకై సకల సంపదలతో సవరించిన ఒక పెద్ద నగరులో బస చేస్తాడు. నరసింగరాయడు తన సంపదలన్నీ అన్నమయ్యవే అని తలపోసి, 'హితునిగా గురువుగా నెల్ల బంధువుగ' అతనినే భావించేవాడు. అన్నమాచార్యుని అనుగ్రహబలంచేత అతడు పరిపంథిబలాలనణచి సింహాసనాన్ని చేకొని, రాజధాని పెనుగొండలో నివాసమేర్పరచుకొని అన్నమాచార్యుని అక్కడికి రప్పించుకొంటాడు, తనకు కల్గిన అభ్యుదయానికి కృతజ్ఞతా సూచకంగా రాయడు అన్నమయ్యకు మ్రొక్కి కనకాంబరాదులను గ్రామ సంతతులను అర్పించి పూజిస్తాడు, అతని కీర్తనములను వినడానికభిలషిస్తాడు. అన్నమయ్య కెలనజూపట్టు సంకీర్తనపరులతో గూడి శ్రుతికలిపి రసరాగభావాలుట్టిపడేటట్లు వేంకటపతిమీద తాను సవరించిన మేలైన కీర్తనములను పాడి వినిపింపగా పరవశించి కవులెల్లఁ జేయెత్తి మ్రొక్కారు. 'మున్ను గన్నవి విన్నవి గావుడగర యీ పదము లన్నమాచార్యునివి మోహన మూర్తులనుచు' వీనుల విందుగా విని చాల మెచ్చుకొన్నారు. ఆతని శృంగార కీర్తనలలోని కవిత, శృంగారభావము కాళిదాసాదులైన కవులందుగాని తక్కిన కవులందుగాని కానరాదని ప్రభువు కీర్తించాడు. అట్లా అందరి ముందు పొగడి పచ్చలకడియాలు, బంగారు వ్రాతపచ్చడాలు, కెంబట్టుశాళ్వాయి, అంగదంబులు, ఉభయాతపత్రాలు, రంగైన వింజామరలజోడు, గిండి, కళాచిక బహూకరిస్తాడు. పెనుగొండలోని తన పెద్దనగరి ప్రక్కనేగల ఒక నగరిని విడిదిగా ఏర్పాటుచేస్తాడు. రోజూ వేంకటాద్రీశుమీది వినుతులు వింటూ వేడుక చెందుతూ వుండేవాడు. కొన్నినాళ్లు గడిచినవి.

ఒకనాడు రాయలు ఆహ్వానిస్తే లాంఛనాలలో చతురంత యానాన్నెక్కి సంకీర్తన పరులు సేవించి వెంటరాగా ఆస్థానానికి వెళ్ళాడు. పల్లకి దిగి వైష్ణవుని చేయూది లోనికరిగి తనరాకకై నిరీక్షిస్తున్న రాజును నెయ్యము తియ్యమెసగ "శ్రీనివాసోరక్షు" తంటూ చే తిరుమణి నిచ్చాడు. రాయలు ఎదురేగి సాగిమ్రొక్కి తన పసిడిగద్దె మీద కూర్చుండజేసి, కవులతో విద్వాంసులతో, గాయకులతో సామంతులలో కొలువుదీర్చిన సభలో కోరి ఈ పాట పలుమారు పాడించుకొని ఆనందించాడు.

'ఏమొకో చిగురు టధరమున యెడనెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
వలపున ప్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా

పడతికి చనుఁగవ మెరుఁగులు పైపై బయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖశశిలేఖల
వెడలిన వేసవికాలపు వెన్నెల కాదుగదా ॥ఏమొ॥

ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
గద్దరి తిరువేంకటపతి కౌఁగిట యధరామృతముల
అద్దిన సురతపు వేళల అందము కాదుగదా ॥ఏమొ॥
(అన్నమా. 3-467)

ఈ పాటవిని పరవశించి పోయాడు ప్రభువు. "ఇదీకవిత్వమంటే" అని మెచ్చుకొన్నాడు. అన్నమాచార్యుల మహత్వమంతా వీను

లార వినీ కన్నులార కనీ కూడా నరసింగరాయడప్పుడు గర్వాంధుడై వ్యామోహం చేత అలాటి పద మొకటి తనమీద కూడా చెప్పమని అర్థించాడు 'హరి హరీ' అని అన్నమయ్య చెవులుమూసుకొని 'హరి ముకుందుని గొనియాడు నాజిహ్వ నిను గొనియాడంగ నేరదెంతైన' అని అతని నైచ్యంపు బలుకును ఖండించి, పొందురోసి, స్వామి సన్నిధికి వెళ్ళిపోతానని దిగ్గునలేచి వెళ్ళిపోయాడు. గర్వాంధుడైన రాయడు అవమానితుడై ప్రతీకార బుద్ధితో అన్నమయ్యకు 'మూరరాయర గండసంకెల నిడి మొగసాలలో నిడ' భటుల కాజ్ఞ ఇచ్చాడు. బంధితుడై అన్నమయ్య ప్రహ్లాదునిరీతి మురవైరిని దలచి

"ఆకటి వేళల నలపైన వేళల
దేకువ హరినామమే దిక్కుమరిలేదు" (౭-100)

అనే పదం పాడతాడు. ఆ సంకీర్తన మహిమకు సంకెలలూడి పడతాయి. ఆ వార్త విన్నరాయడు పగగొన్న బెబ్బులివలెవచ్చి తన యెదుటనే మళ్ళా సంకెల వేయిస్తాడు. అతని యెదురుగానే అన్నమయ్య అదే పాటపాడడమూ మరళా సంకెల లూడిపడడము జరుగగా రాజు భయభ్రాంతుడై ఆచార్యుని చరణాబ్జాలకు సాగిలి మ్రొక్కి 'అపరాధి నపరాధి నన్నమాచార్య కృపజూడు కృపజూడు కృపణ శరణ్య' అని దీనుడై విలపిస్తాడు. చిన్ననాటి నుండీబంటుగా పనిగొన్న కారణాన్ని పురస్కరించుకొని పశ్చాత్తప్తుడైనందువల్ల అన్నమాచార్యుడతణ్ణి అనుగ్రహిస్తాడు. నరహరి సంకీర్తన చేసే వారిని నరసమానులుగా పరిగణించవలదని రాజునిమందలిస్తాడు. కృతయుగంలో ధ్యానానికి, త్రేతాయుగంలో క్రతువులకి, ద్వాపరంలో అర్చనలకి మెచ్చి పరమాత్ముడిచ్చే యీవులన్నీ కలియుగాన సంకీర్తనంతోనే సమకూడుతాయని బుద్ధి చెప్పి అన్నమాచార్యుడు ఇక నక్కడ ఉండనొల్లక ప్రయాణమవుతాడు. నరసింగరాయడు పట్టమహిషితో

కూడా ఆయన పాదాలను పన్నీటితో కడిగి పూజించి సాగనంపే టప్పుడు పసిడి యనుసుల చతురంత యానమెక్కించి తన మూపున పల్లకి కొమ్ముబట్టి యెత్తి భక్తిని ప్రదర్శించాడు.

తర్వాత అన్నమయ్య తిరుమల చేరుకొని స్వామివారికి "శృంగార మంజరి" ని కృతి యిస్తాడు. శేషాచలధీశుడు కూడా అన్నమాచార్యుల సంకీర్తనలకు చొక్కి ఆనందిస్తూ వుండేవాడు. ఈ విధంగా అన్నమాచార్యుడు ప్రతి సంవత్సరము తప్పక కొండ మీద జరిగే బ్రహ్మోత్సవాలు సేవించుకొంటూ ఆ దేవుని అనుగ్రహం చేత సకలవాచాశుద్ధి కలిగి మహామహిమాన్వితుడై ప్రసిద్ధికెక్కెను. అన్నమయ్య మహిమలను విని ఎవరెవరో దీనులు ఏవేవో ఫలాలను అర్పిస్తూవుండేవారట. చిన్నన్న తాతగారి మహిమలను ఒకటిరెండు గ్రంథస్థం చేశాడు.

తమ అగ్రహారమైన మరులుంపులోని పుల్లని జీడిమామిడి పండ్ల చెట్టుని, ఆరగింపులో మాధవునికి పండ్లు పులియకుండా వుండ డానికై, తన మహిమచేత దానిని తాకి తియ్యని పండ్ల చెట్టుగా మార్చివేశాడట. ఎవరో పెండ్లి చేసుకోడానికి కాసు వీసము కావా లని అర్థిస్తే అన్నమయ్య అటువలెచే గాక అన్నారట. తర్వాత ఆ విప్రున కెవరో రాజు పిలిచి ధనమిచ్చి పెండ్లికేర్పాటు చేయించె నట.

ఇట్లా మహనీయుడై మహిమాన్వితుడై వృద్ధుడైన అన్న మయ్యని పురందరదాసు దర్శింపవచ్చినట్లు చిన్నన్న పేర్కొ న్నాడు. వారు పరస్పరము ఒకరినొకరు ఘనంగా సంభావించుకొన్నా రట. ఈ విధంగా చిన్నన్న విపులంగా తాతగారి జీవితాన్ని గ్రంథస్థం చేశాడు.

ఈ గ్రంథంలోని విశేషాలనుబట్టే కాకుండా అన్నమాచార్యుల సంకీర్తనలనుంచి వారికి సంబంధించిన వైయక్తిక విషయాలను మనం గుర్తించవచ్చు.

వారి సంకీర్తనలు చెక్కిన తొలి రేకులో అన్నమాచార్యులకు 16వ యేట స్వామి ప్రత్యక్షమైనట్లు అది మొదలుగా ఆయన సంకీర్తన రచనకారంభించినట్లు తెలియవస్తుంది. ద్రావిడ భాషలో నమ్మాళ్వార్లు కూడా తమ పదహారవయేటనే ప్రజ్ఞాపూర్ణులై దివ్య ప్రబంధ రచన చేసినట్లు ప్రఖ్యాతి. కృష్ణమాచార్యులు కూడా పదహారవయేటనే సంకీర్తన రచన కారంభించినట్లు అతని వచనాలనుబట్టి తెలుస్తున్నది. ఇలాగే ఆయా మహాత్ముల జీవితాల్లో ఎన్నో సామ్యాలు మనం గుర్తించగలం.

అన్నమయ్య 'చుట్టపుబంధాల రొచ్చు'ని 5-111 కీర్తనలో ఏవగించుకొన్నాడు. దొరయై అప్పలవారిని దోసి పరిభవాన్ని పాయ జేసుకొన్నాడు (2-213). నరసింగరాయని అజ్ఞత గుర్తుకొచ్చి కాబోలు 'నరులను బొగడు జీవముకన్నా చెట్టుగనో పుట్టగనో పుట్టుటమే'లనుకొన్నాడు (5-222). సంకెలనిడి రాయుడు అన్నమయ్యను బాధించి నపుడు కాబోలును

'నీ దాసుల భంగములు నీవ చూతురా
యేదరి చూచేవు నీకు నెచ్చరించవలెనా

ద్వారకా నగరములో తగనెత్తమాడే నీకు
బిరాన ద్రౌపది మొరవెట్టినయట్లు
ఘోరపు రాజసభలగుండి విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిక రక్షించరాదా' (8-266)

అని మొరపెట్టుకొన్నాడు స్వామికి

గజపతుల దండయాత్రల సందర్భంలోవారి పలుకుబడికి లొంగి కాబోలు 'వొగినొడ్డె భాషలాడి వొడ్డెవాడనైతి-తెగి తెలుగాడనేర్చి తెలుగువాడనైతి' (9-90) అనుకొన్నాడు.

నరసింగరాయడు టంగుటూరిలో ఉన్నప్పటినుండి అన్నమయ్యతో సంబంధాన్ని అపేక్షించినవాడే. వాళ్లిద్దరి మైత్రి నరనారాయణుల మైత్రివంటిదని సంభావించుకొన్నాడు నరసింగరాయడు. అది చెడక శృంఖలా బంధనోదంతంవఱకు సాగినట్లు కనిపిస్తుంది. అప్పటికి అన్నమయ్య కొంత వయసుపైబడిన వాడుగా అనిపిస్తాడు. 'పల్లకిదిగి వెంటబరగు వైష్ణవుని పల్లన చేయూది యాలోనికరిగి'నట్లు చిన్నన్న వర్ణించినాడుకదా! అన్నమయ్య ఆ తర్వాత సరాసరి తిరుపతికి వెళ్ళినట్లు చిన్నన్న చెప్పాడు. కొండ మీద బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరము తప్పక సేవించుకొనే వాడు. తాళ్ళపాక శాసనుడైన అన్నమయ్య తన కుటుంబంవారితో కలిసి తాళ్లపాకలోనూ, తమ అగ్రహారమైన మరుబుంకు(?)లోనూ ఉంటూ అప్పుడప్పుడు తిరుపతికి వస్తూ పోతూ వుండినాడని తోస్తుంది. చివరి రోజుల్లో ఆయన ఎక్కడుండినాడో యేమో 'వేంకటాద్రి పొంతనుండ వేగమమ్ముబంపవే' (9-143) అనీ 'కాలము కాలము గాదు కపటాలె తలిచాయ' అనే (5-208) కీర్తనలో 'సిన్ననాట నుండి తన పెంచిన యీ దేహము సున్నిటివలె గాదు ముదిసేని...కింకపు కీసరుచేత కీడైన దేహమువంక వంక తెరువుల వడిసేని, యింక నేవిధి చేత నెప్పుడేడల బడునో వేంకటేశుం జేరంబడవేయగదరే' అనీ తన వారినర్థించాడు.

అన్నమాచార్యుడు తమ అగ్రహారాల్లో ఉన్నప్పుడో, యాత్రల సందర్భంలోనో మరి యేకారణంచేతనో వారి యింటి పూజా విగ్రహాలు పోయినవి. త్యాగరాజస్వామివారి జీవితంలోనూ ఇలాటి ఘట్టమే ఉన్నదికదా!

'నీవు నా సొమ్మవు నేను నీ సొమ్ము
యీవల నీవెపుడు మాయింట నుండఁదగవా?
అనీ 'ఇందిరారమణుఁదెచ్చియియ్యరో

పొంది యీతని పూజింపఁబొద్దాయెనిపుడు' (11-134) అనీ, కన్నవారిని వేడుకొన్నాడు. తిరిగి ఆ పూజా విగ్రహం వారికి లభించింది.

'కంటికిమునేడిది గరుడాచలపతి
యింటివేలుపగు నీశ్వరుడితడు' (11-209) అని ఆనందంతో పాడుకొన్నాడు. తమ యింటి దేవతార్చన విగ్రహాలను తాళ్ళపాక వారు పలు కీర్తనలలో ప్రస్తుతించుకొన్నారు. 'బలుపగు లక్ష్మీపతి యగు శ్రీహరి యిల మాయింటను యిదివోనిలిచె' (8-10). 'బలదేవుడైన శ్రీపతి మాయింటిలోన అలరివున్నాడు. మాయంతవారు వేరె' (8-34) అంటారు వారు. ఆ దేవతార్చన విగ్రహాలే తాళ్ళపాక వంశీకులివ్వగా నేడు తిరుపతిదగ్గరున్న మంగాపుర కళ్యాణవేంకటేశ్వరాలయంలో భద్రంగా పూజాదికములందుతూ వున్నవి!

పొలము రాజుల వెంటపోయే దైన్యం తగదని తమవారికి అనుభవ పూర్వకంగా చాటిచెపుతాడు అన్నమయ్య.

"ఛీ ఛీ వివేకమూ చిత్తపు వికారమూ
యేచి హరిఁగొలువక హీనుఁడాయె జీవుడు

బతికేనంటా బోయి పయిడిపుచ్చుక తన
పతి యవసరమునఁ బ్రాణ మిచ్చీని
బసు కందులో ననేది పసిడి యెక్కడ నుండు
గతి హరిఁగొలువక కట్టువడె జీవుఁడు" (6-13)

ఇలాగే తన సన్నిధిని మహిమను విని ఏవేవో కోరి తనచుట్టూ ముసిరే వారిని చూసి రోసి ఇలా చెప్పుకొన్నాడు.

'పరమాత్మ నిన్ను గొల్చి బ్రతికేము
విరసపుజాలి జిక్కి వెతఁబడనోపము

పొసగ దేవుఁడిచ్చినా పూజారి వరమీఁడు
విసిగి నేవిడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసిరేరు కోరికఁదీర్చుకునేరు
పసిలేని పనులకు బడలనేనోపను' (8-220)

ఇదే విధంగా సమకాలపు రాజకీయాలను సాంఘిక పరిస్థితులను ప్రతి బింబించే కీర్తనలూ ఎన్నో వున్నాయి.

## పెదతిరుమలాచార్యులు (క్రి. శ. 1458-1554

చిన్నన్న ద్విపద కావ్యంగా అన్నమాచార్య చరిత్ర వ్రాసి తన తండ్రిగారైన, పెదతిరుమలాచార్యుని చరిత్రను గూడ వ్రాసి నాడేమో అనుకోవచ్చు. "తాళ్ళపాక తిరువెంగళనాథుని జీవితము కార్వేటి నగర సంస్థానములో ఉన్నది." అని అన్నమాచార్య చరిత్ర ద్విపదలు గల వ్రాతప్రతిలో గ్రంథము ముగిసిన తర్వాత ఉండడం వలన తాళ్ళపాకకవుల జీవితచరిత్రలు వరుసగా వ్రాయబడి ఉండిన వేమో అనిపిస్తుంది. కాని మనకీనాడు తక్కినవేవీ కానరావడంలేదు. చిన్నన్నకు తండ్రిగారియెడ గల భక్తి తాత్పర్యాలకి ఆయన వేయించిన శాసనాలు, వ్రాసిన ద్విపదలు సాక్ష్యం పలుకుతున్నాయి. అన్నమాచార్య చరిత్రలో చివరికి అన్నమయ్య "సిరివరు మెప్పించి చెలగి యాదేవు—వరమున దనయంత వారి బుత్రుల, నరసయాచార్యు నున్నత యశోధనుని — తిరుమలాచార్యుని ధీవిశారదుని, గాంచి వారును దనకరణి విద్యలను - గాంచనాంబరు భక్తి కలిమిఁ బెంపొంద, శౌరికథాసుధ సల్లాప గరిమ—ధారుణి నెంతయుఁదన రాచుచుండె "అని చిన్నన్న వ్రాశాడు. చిన్నన్న తన తండ్రిగారి

జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని చైత్ర మృగశీర్ష మొక ఉత్సవంగా జరిగేటట్లు విశేష కైంకర్యాలకి ఏర్పాటు చేసిన విషయం శాసనస్థమై వుంది (తి. తి. దే. శా. 5-159)

భారత కవిత్రయంలో తిక్కనకున్న స్థానం ఈ పదకవిత్రయ్యంలో పెదతిరుమలయ్యకున్నది. ఈయనకు శ్రీ మద్వేగమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర బిరుదులున్నవి. సమకాలంలో నమ్మిన శిష్యవర్గాన్ని పెద మిత్రవర్గాన్ని కూర్చుకుని మతసాహిత్యాల కెనలేని సేవచేసిన వాడీతడు. అలవోకగా బహువిధ సాహితీ ప్రక్రియల్ని సాధించి, వీరశైవ కవి అయిన పాల్కుర్కి సోమనాధునివలెనే, వైష్ణవాంధ్ర సాహిత్యాకాశంలో ధ్రువతారగా వెలుగొందినవాడు. ఆంధ్రవేదాంత కర్తలనీ పంచమాగమ సార్వభౌములనీ, పంచమాగమ చక్రవర్తులనీ ప్రఖ్యాతి చెందిన కృష్ణమాచార్య, అన్నమాచార్య, తిరుమలాచార్యులు ముగ్గురిలో మూడవవాడీయన. అన్నిటినీ మించి గొప్పపద కర్త. మన ప్రాచీన పద వాఙ్మయం సుస్థిరంగా నిలచివుండే విధంగా సంకీర్తన భండాగార వ్యవస్థకి రూపుదిద్ది, పెంపు వెలయించి, ఎంతో కృషిచేసినాడు. తన జీవిత సర్వస్వాన్నీ స్వామిసేవకు కళాసేవకు అంకితం చేసుకొన్న చరితార్థుడు.

తండ్రిగారి ఆదేశానుసారం తానూ సంకీర్తన రచన ప్రారంభించి ఆయనవలెనే ఎన్నో వేల పదాలను చెప్పాడు. ఈయన జీవిత విశేషాలు గ్రంథస్థమై లభింపక పోవడంవల్లనూ, పదరచనలయినా ఇంకా సరిగా ప్రకటింపబడక పోవడంవల్లనూ ఈయన జీవితాన్ని గూర్చిన సమగ్రమైన అవగాహన మనకింకా కలగడంలేదు. కాని దొరికిన కొద్దిపాటి గ్రంథస్థాధారాలనుబట్టి, సంకీర్తనలనుబట్టి

సూక్ష్మంగా పరిశీలిస్తే ఈయన, జీవితంలో ఎన్నో ఎదురు దెబ్బలు తినీ, నిబ్బరంగా నిలబడి, అచంచలమైన ఆత్మవిశ్వాసంతో, స్వామి వారి అనుగ్రహ బలంతో అనుకొన్న కార్యాలను తుదనుట్ట నిర్వహించి కృతార్థుడైనట్లు కనిపిస్తుంది.

అన్నమాచార్యులు పశ్చాత్తప్తుడైన నరసింగరాయలను వీడి వచ్చిన తర్వాత కాస్తవారు రాజులకు రాజకీయాలకు దూరంగానే వుండినారు. అయినా ఆ తర్వాత ఏర్పడ్డ రాజకీయపు సుడిగుండాల సుళ్ళు అందరితోపాటే అన్నమాచార్యుల సంతతిని లోగొని గజిబిజి పరచి వుంటాయి. వ్యక్తిగతమైన స్పర్ధలూ కొన్ని వారి కడ్డువచ్చి వుంటాయి. తుళువనరసానాయనికి, వీరనరసింహరాయలకి, కృష్ణ రాయలకి తాళ్ళపాక వారితో అట్టే పొందు పొసగినట్లు కనపడదు. మళ్ళా అచ్యుతదేవరాయలు రాజ్యానికి వచ్చిన తర్వాతగాని ఆ పరిస్థితులు చక్కబడినట్లు కానరాదు.

పెదతిరుమలాచార్యుడి కీర్తనమిది చూడండి.

"నాటికి నాడు గొత్త నేటికి నేడు గొత్త
నాటకపు దైవమవు నమో నమో"
సిరుల రుక్మాంగదు చేతి కత్తిధార తొల్లి
వసుస ధర్మాంగదుపై వసపూలాయ!
హరి నీకృప కలిమినట్లనే అరులచే
కరఖడ్గధార నాకు గలువ దండాయ
అలర శ్రీ వేంకటేశా ఆపదలన్నియును బాసి
యిలనన్ను గావినది యెన్నగతలాయ
(6-85)

ఇందులో ఎవరో పెదతిరుమలయ్యను చంపాలన్న ప్రయత్నం చేసి నట్లు కనపడుతుంది. ఇదే విషయాన్ని "మండెముకోటలో మండలాల వెరుగ మండలాగ్రాహాతి మహనీయ పుష్పదామమై ధరాంగ దస్థితిఁబొలిచెనే మహామహుని యహీన గాత్రమున" అని చిన్నన్న కూడా వివరించాడు. ఈ విషయమే పెదతిరుమలాచార్యుని గూర్చి గల మరియొక కీర్తనలో కూడా వుంది.

'వేకరి మండెముకోట వెళ్లుతా విచ్చనవిడి రాగా నొక
పీకతో వేసిన కత్తి తునకలాయ వెన్నునోకినయంత నే
గుములుగూడి యలుగులు తిరుగ చాటిచుట్టుకొన్న కురుదోవ
నతడు
కమలనయనుని తలచిన మాత్రాన కకవికలై పాఱెను'
(చూ. అన్నమా చరిత్ర పీఠిక-పు. 65)

'ఏమి సేయవచ్చుఁగర్మమిచ్చినంత కానిలేదు
తాము చేసినంత వట్టు తమకుఁబోరాదు
అడిగి పరుల బతుకాసపడ్డ మరిలేదు
విడిచి నెతుటఁదోగి వీరుఁడై నలేదు
ఇడుమపాటుఁజొచ్చి యియ్యకున్నలేదు' (11-2-29)

అన్న కీర్తనలోనూ ఈ ప్రస్తావన కొంత వుంది.

'దిక్కు లేకపోయె నిక్కె దిన దినము
వెక్కసపు లోక[illegible]తే [illegible]భుడెవ్వడో"
[illegible] తపుగా నెల వాసు గుడిచేటి కంచము
ఎరుకలో [illegible] దొంగ
[illegible]త్తిగానే [illegible] కోకబయుట వేసిన
నెత్తని ద[illegible] బటి [illegible]ంగె నెవ్వడో (12—254)

అన్న కీర్తనలో కవి తమ కెవరో తిండి బట్ట యిల్లు లేకుండా చేయ డాన్ని వివరిస్తాడు. కృష్ణరాయలు క్రీ॥ 1514 లో తమ అగ్రహార మైన తాళ్ళపాకను రొఖధాన్యాలతో స్వామివారి కర్పించి ప్రసాద భాగాలను కూడా తమకు చెందకుండా చేశాడు.

"పుట్టు భోగులము మేము భువిహరిదాసులము
నట్టనడిమి దొరలు నాకియ్య వలెనా॥
గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామిని యీకె మగని ప్రాణధరి లెంకలము
వోమి మాకాతడే యిచ్చు వొరులియ్యవలెనా" (10-94)
"కటకటా వూరేలు కర్తే దొంగలగూడి
యిటువలె జేసిన నేది తెరగు (10-2-65)

అనే పదాలలో తాళ్ళపాకవారు ఆ విషయాన్నే స్మరించి నిబ్బరంగా నిలబడినట్లున్నారు.

ఏదో వైరస్యమే కారణం కాకపోతే సాళువ నరసింహ రాయలు, అచ్యుతరాయలు, ఆ తర్వాత వచ్చిన ప్రభువులందరూ అంతోయింతో ఆదరించిన తాళ్ళపాకవారిని తుళువ నరసారాయడు, కృష్ణరాయడు మాత్రం పండిత పక్షపాతం గలవారై యుండీ కూడా ఆదరింపకుండడమట్లా వుంచి అనాదరాన్ని ప్రదర్శించడానికి వేరే హేతువు కనపడదు గదా!

పెద తిరుమలయ్య జీవితంలో ఢక్కా మొక్కీలు తిన్నవాడు

"రుచులు నేనిటు గోనని వేడవి రోతలయ్యేడి గాక నేడు
వచనముల హరి నీకు శరణని వసుధ బావనమైతి గాక"
(9-116)

అని ఒక కీర్తనలో తనను గూర్చి తాను చెప్పుకొంటాడు.

పెదతిరుమలాచార్యుని కీర్తనలన్నీ ప్రకటింపబడితేగానీ తక్కిన విశేషాలంతగా మనకు తెలియరావు. ఈ కీర్తనలో తిరుమలయ్య తన రూపాన్ని ఎట్లా దిద్దుకొన్నాడో చూడండి.

"నీ గురుతులు చూచుకో నీ బిరుదులెంచుకో
యీ గతిని గల బంటు నీఁక నన్నుఁగావవే"

కానీతే నేనెంత కఠిన చిత్తుఁడనైన
నా నొసల నివే పట్టె నామాలు
మేనుతోలు నెమ్మెలతో మెరసిన దైనాను
పూనితిఁదమ్మి తులసి పూసలపేరులు"

భ్రమసి నేఁజేసినది పాపకర్మము లైనాను
జమిళి భుజాల నివే శంఖచక్రాలు
అమరఁదఱచుగా నేనాడేవి కల్ల లైనా
తమిఁబాడీ నాలిక నీతగు సంకీర్తనలు"

తలఁచితే నా వోజ తామసగుణ మైనాను
పిలిచేది భువిలో నా పేరు తిమ్మఁడు
అలర శ్రీ వేంకటేశ అన్నిటనే దుష్టునైనా
తలకొనె నాయందు దాసరితనములు" (11-181)

## చినతిరుమలాచార్యుడు

క్రీ. శ. (1488-1562). ఇతడే పెదతిరుమలాచార్యుని కుమారులలో పెద్దవాడూ, తాళ్ళపాక పదకవిత్రయంలో చివరి వాడూను. అన్నమాచార్యులకు పెదతిరుమలాచార్యుడు 'చనవరిసుతు'డైతే, చినతిరుమలయ్య ముద్దుల మనుమడుగా కనిపిస్తాడు. ఇతనికి తాత గారే బ్రహ్మోపదేశం చేశారు.

"తాళ్ళపాక అన్నమాచార్య దైవమవు నీవు సూ..
వేళమే శ్రీహరిఁగన వెర నాన లిచ్చితివి
గురుఁడవు నీవే సుమ్మీ నకు మతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమ బంధుఁడనైనా పరికింప నీవే సుమ్మీ
వరుసనేఁ జెడకుండ వహించుకొంటివి (16-1-39)

అన్నమాచార్యుడే మనుమని ఆదరించి ఇంతగా అభిమానించడానికి కారణం ఆయనకి తన పెద్ద కుమారుని నరసింగన్న వలన కలిగిన మనుమలెవ్వరూ చేతికందివచ్చి నిలువకపోవడమే హేతువు కావచ్చునేమో. పోతే తండ్రిగారుండగా తాతగారు బ్రహ్మోపదేశంచేయడం వింతగానే వుంది.

చిన తిరుమలయ్య సంస్కృతాంధ్రాల్లో మహాకవి. గొప్ప విద్వాంసుడు. అష్టభాషా చక్రవర్తి అని బిరుదు గలవాడు. తండ్రి తాతలవలెనే శృంగారాధ్యాత్మక సంకీర్తనలను రచించాడు. ఇతడే నాటినుండి సంకీర్తన రచన కారంభించాడో తాళ్ళపాక వారి రేకుల్లో లేదు గాని ఒక కీర్తనలో 'గరిమ నా వయసున తాటకిఁజంపిన కౌసల్య నందన రాఘవ' అని వుండటాన్ని బట్టి రామయణకథా సందర్భాన్ని అనుసరించి పదిహేనేళ్ళకి తాటకిని చంపట్టుండడం వలన చినతిరుమలయ్య కూడా పదిహేను పదహారేళ్ళకి తాతగారి వలెనే సంకీర్తన రచన కారంభించి వుంటాడని మా[illegible] శ్రీ శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు వ్రాశారు. చినతిరుమలయ్య తాతగారి నెంతో భక్తి శ్రద్ధలతో కీర్తనలలో ప్రస్తుతించాడు తన బ్రహ్మోపదేశం అయిన తర్వాత కూడా తాతగారు కొంతకాలం జీవించినట్లు సంకీర్తనలను బట్టి తోస్తుంది. ఈయన ఒక కీర్తనలో [illegible]లను వారు (నందవరీకులు) పచ్చితామసులనీ, అలాంటి వారిని

పరమ సాత్వికులనుగా చేసి యెన్నడులేని వైష్ణవం అచ్చంగా కృపచేసి సంకీర్తనముపదేశించి, కడువివేకుల జేసి, యిడుమలెల్ల బాపెననీ అన్నమాచార్యుల గురించి వ్రాశాడు. ఇతడు గురుభక్తి అపారంగా గలవాడు. భగవద్భక్తిని గోల్పోయి లౌకిక ప్రాభవానికై ప్రభువుల వెంటపడే దైన్యాన్ని చినతిరుమలయ్య గర్హించాడు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి, దిగువ తిరుపతిలోని వేల్పులకు గూడ ఈయన చాలా కైంకర్యాలు జరిపించాడు. క్రీ. శ 1540లో తమ అగ్రహారమైన మంగాపురంలోని కళ్యాణ వేంకటేశ్వరాలయ జీర్ణోద్దారం చేయించాడు. అక్కడ ఆళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతో తన తాతగారైన అన్నమాచార్యుని విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠాపించాడు. ఈ మూర్తి ఇవాళ అక్కడ కానరాదుగాని, ఆ గుడిగోపురంమీద, మంటప శిలాస్తంభాలమీద తాళ్ళపాక కవుల మూర్త్యంతరాలు మాత్రం నేటికీ దర్శనీయంగా వున్నవి. ఇతడు మత ప్రచారానికీ సంకీర్తనల ప్రచారానికి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, గుంటూరు మొదలైన మండలాలు సంచారం చేసినట్లు కనపడుతుంది. మంగళగిరి దేవాలయంలో ఈయన సంకీర్తన వాకూళ్ళజలు చేయించాడు.

ఇట్లా ఈ తాళ్ళపాక పదకవిత్రయంవారు క్రీ. శ. 15, 16 శతాబ్దాల్లో మన సంకీర్తన వాఙ్మయాని కెనలేని సేవ చేశారు.

### తాళ్లపాక పదకవుల తాత్త్వికత

తాళ్ళపాక పదకవులు తాత్త్వికభావాల నెన్నింటినో సంకీర్తనలుగా ఆలపించారు. భగవత్సేవలో సంకీర్తన సేవ మహనీయమైనది కావడంచేత ఆ సేవలోనే జీవితమంతా గడుపుకొన్నారువారు. వారు తమ శరీరాన్నే ఒక పసిడివీణగా భావించి పరమాత్ముని చేతి కర్పించు

కొని ఆతడు మీటినట్లుగా పలికి వేడుక రాగాలను, వింత తాళాలను వినిపింప చేశారు.

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక మువ్వది రెండువేళల రాగాలను॥
తనువో వొళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టిన తాళ్లు
మనసే నీ బద్దితాడు మరిగుణాళె జీవాళి
మొనసి పుట్టుగే మూలమైన కరడి॥
పాప పుణ్యాలిరువంక పైఁడి వెండి యనుసులు
పై పై నుత్తికె మేటిపై చనిగె
కోపుల నాలికలోనఁగుచ్చికట్టిన తాడు
చూపరాని సంసారమే సూత్రపుగణికె॥
జీవునికి దండె సేసినవాడవు నీవు
వావాతి మాటలె నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరాలిచ్చితివి మెచ్చితివి
శ్రీ వేంకటేశ నీవే చేకొన్న దాతవు॥ (9-178)

ఈ జగన్నాటకంలో పరమపురుషుడగు సూత్రధారుడాడించి నట్లెల్లా ఆడే సూత్రపు బొమ్మలు తామని వారు గుర్తించారు. అందుకే సర్వాత్మ సమర్పణంగా జీవితాన్ని గడిపారు. మానుష జన్మనెత్తిన ఫలాన్ని వారు పరమార్థాన్ని యెరిగి పూర్ణంగా అనుభవించారు. వారి దృష్టిలో ఈ శరీరం ఒక ఆలయం. పరమాత్మునికి నెలవగు వైకుంఠం.

'దేవుడా నా దేహమే నీకు తిరుమలగిరిపట్టణము
భావింప హృదయ కమలమె బంగారపుమేడ' (2-355) అనుకొన్నారు.

"నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి"

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరి పీఠమట
కనుగొన చూపులే ఘనదీపమట
తన లోపలి యంతర్యామికిని"

పలుకే మంత్రమట పాడిన నాలికే
కల కలమను పిడిఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలపు లోపలనున్న దైవమునకు"

గమన చేష్టలే యంగరంగ గతియట
తమిగల జీవుడే దాసుడట
అమరిన పూర్పులే యాలవట్టములట
క్రమముతో వేంకటరాయనికిని" (6-82)

ఇంకా వారి దృష్టిలో ఈ శరీర మొక రథమైతే జీవుడే సారథి. పంచేంద్రియాలు లాగగా పరుగెత్తుతుంది. ఇందులో అధివసించినది ఆ పరమాత్మ

"గుఱ్ఱాలు గట్టని తేరు కొంక కెందైనాఁబారీ
విట్టపీగుచుఁదీసీని వేడుకతో జీవుఁడు"
...యేపుల శ్రీ వేంకటేశుఁడెక్కి వీధులనేఁగఁగ
కాపాడిన రథము గడిపెఁబో జీవుఁడు. (6-152)

అందుకే వారి శరీరాన్ని మోచుకొని పరమాత్ముని ఊరూర నూరేగించి మత ప్రచారం చేశారు. ఇలాగే దేహదేహి సంబంధాన్ని రమణీయంగా అలంకారికంగా వారు పలు కీర్తనలలో ప్రశంసించారు. మానుష శరీరమెట్టిదైనా, జీవుడెట్టివాడైనా, పరమాత్ముని తోడి

సంపర్కమే దీనికి భవ్యతను చేకూర్చేది. 'పరుస మొక్కటెకాదా పయిుండిగా చేసేదిఅరయలోహ మెట్టున్నాఅందుకేమి'అని వనజనాభుని భక్తివదలకుండా జీవించారు. "నాస్తితేషు జాతి విద్యారూపకుల ధన క్రియాది భేదః" అని కదా నారద సూత్రము! అందుకే "ఏకులజు డైననేమి యెవ్వడైననేమి ఆకడ నాతడె హరినెరిగిన వాడు" అని వారు నిస్సంకోచంగా చెప్పుకోగలిగారు. "దేహినిత్యుడు- దేహముల నిత్యాలు, అని అంతర్యామివి నీవు-అంగమాత్రమే నేను, చింతింప నీవే స్వతంత్రుడవు—జీనే బరతంత్రుడను అని 'భోగము నేను నీకు భోగివి నీవు' అని అనేక రీతుల జీవపరమాత్మల అనుబంధరహ స్యాన్ని పలుకీర్తనలలో ప్రపంచించారు. ఈ కీర్తన చూడండి.

"నిన్నూ నన్నూ నెంచుకోని నేరమిగాక
పన్నిన సూర్యకాంతి ప్రతిసూర్యుడౌనా॥
జలధిలోపలి వలిఘను జలధి దానౌనా
జలములాధారమైన జంతువుగాక
నెలవై నీలోని వాడ నీవే నే నౌదునా
పొలసినీయాధరువు బొమ్మనింతే కాక॥
ముత్తెపు జిప్పలనీరు మున్నిటివలె నుండునా
ముత్తెములై బలిసిలో మొనపుగాక
నిత్తెపు శ్రీ వేంకటేశ నీ శరణాగతులము
మొత్తపు లోకులమా ముక్తులము గాక. (6-139)

సూర్యుని విడిచి కాంతి ఉండలేదు. కాని కాంతియే ప్రతిసూర్యుడూ కాదు! ఇదే విషయాన్ని వారు మరొక తీరున ఇలా అనుకొన్నారు.

"కైవసమై యీ దేవుడె యిటునను గరుణింపుచు రక్షింపుచు నుండన్
పూవును పరిళమును వలెనే నే పొదలుచు నుండెడనయ్యా నేను" (8-85)

"ఓహో హోం దేం వాగి బ్రహ్మమిది యని
సాహసమున శ్రుతి చాటెడిని
పరమును నపరము బ్రకృతియు ననగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుఁడును అపరము జీవుఁడు
తిరమైన ప్రకృతియె దేహము॥ (౬-221).

అనే కీర్తనలో శ్రుతులుచాటే పరమసత్యాన్ని తాళ్ళపాక వారు పదేపదే చాటి చెప్పారు.

ఉదాహరిస్తూ పోతే సుదరదుగనక సంగ్రహంగా చెప్పుకోవాలి. తాళ్ళపాకవారు స్వామివారి అనంతకల్యాణ గుణాలను నోరార పాడుకొన్నారు. ఆయన దివ్యసౌందర్యాన్ని తనివిదీర దర్శించారు. పరావ్యూహవిభావ అంతర్యామి అర్చారూపాల ప్రవ్యక్తమయ్యే ఆపర తత్వస్వరూపాన్ని వారు విశ్లేషించి ప్రదర్శించారు. స్వామివారి పంచాయుధాలను కీర్తించారు. అభయహస్తాన్ని, శ్రీపాదతీర్థాన్ని కొనియాడి సేవించారు. భక్తితత్వాన్ని ప్రపంచించారు. ఆర్తులై జిజ్ఞాసువులై, అర్థార్థులై, జ్ఞానులై పలువిధాలభక్తిని సాధించారు. భాగవతంలోను, నారదభక్తి సూత్రాలలోను ప్రపంచితమైన నవవిధ, ఏకాదశ విధ భక్తిభేదాలనేగాక, 'నానాభక్తు' లనికనెన్నిటినో వారు ప్రస్తావించారు 'హరికిఁగా వాదించుటది ఉన్మాదభక్తి. పరుల గొలువకుండే పతివ్రతాభక్తి, అరమరచిబోకుండే ఆనందభక్తి-అతిసాహసపూజ ఆదిరాక్షసభక్తి' అంటూ 'నానాభక్తులివి నరుల మార్గములు యేనెపాననైనా నాతఁడియ్యకొనుభక్తి' అని వివరిస్తారు. ఈ భక్తియోగ సాధనకి అవసరమైన వివేక విమోకాది సాధన సప్తకాన్ని తాళ్ళపాక కవులు ఎన్నో కీర్తనలలో ఉగ్గడించారు. ఈ భక్తియోగం కుదరని వాళ్ళకని అంగాంగి రూపాసగల ప్రపత్తిమార్గాన్ని ఉపదేశించారు.

గురుభక్తినిచాటి చెప్పుకొన్నారు. ఆంధ్ర వేదాంతకర్తలై వాసి కెక్కారు.

సర్వవేదాంతసారాన్ని మూడు ముక్కల్లో చెప్పినవారి యీ కీర్తన చూడండి.

"మూడేమాటలు మూడు మూండ్లు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంత రహస్యము॥

జీవుని స్వరూపము చింతించి యంతటాను
దేవుని వైభవము దెలిసి
భావించి ప్రకృతి సంపదయిది యెఱుగుచే
వేవేలు విధముల వేదాంత రహస్యము॥
తనలోని జ్ఞానము తప్పకుండా, దలపోసి
పనితోడ నందువల్ల భక్తినిలిపి
మనికిగా వైరాగ్యము మరువకుండుచే
వినవలసినయట్టి వేదాంత రహస్యము
వేడుకతోనాచార్య విశ్వాసముగలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁగొలిచి చూపుఁడోచే
పీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము॥ (6-223

ఇందులోని భావాల ప్రపంచనమే తాళ్ళపాక కవుల ఆధ్యాత్మ సంకీర్తనముల పరిచయము.

తెలుగులోని పదకవితల పరిణామ చరిత్రలో తాళ్ళపాక పద కవిత్రయం వారుద్ధరించిన నిబంధ పదకవితా పద్ధతే తరువాతి కాలాన రామదాసాదుల భజనకీర్తన పద్ధతిగాను, క్షేత్రజ్ఞాదుల నృత్యాభి

చెందుతూ వచ్చిందనవచ్చు. ఇదికాక వృత్త, నిబంధ, అనిబంధ పద కవితల సమాహార రూపమైన మధురకవితాశాఖ ఒకటి కథాసంగతిని కూర్చుకుని దృశ్యప్రధానమైన యక్షగాన పద్ధతిగాను వేరొక ప్రక్క రూపుదిద్దుకొంటూ వచ్చింది.

ఇందులో మనకిపుడు ప్రస్తుతమైనది భజన కవితా పద్ధతి.

# నిబంధపదాలు—భజన కీర్తన పద్ధతి

హరిదాస కూటములవారు క్రి.శ. 15, 16 శతాబ్దులలో సంకీర్తన రచనకుపక్రమించి, భజనకూటాలను నిర్వహించడంతోనే ఆంధ్ర కర్ణాటక ప్రాంతాల్లో ఈ పద్ధతి వ్యాప్తికి వచ్చింది. సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో సుబ్బరామ దీక్షితులవారు తాళ్ళపాక (చిన్నన్న) వారిని గూర్చి వ్రాస్తూ "ఇతడు తెనుగు బ్రాహ్మణుడు. వేంకటాచలపతి భక్తుడు. తిరుపతిలో నుండినవాడు. వేంకటరమణ విషయమై భాగవత సంప్రదాయనుగా వాడుకలోగల ఉత్సవ పద్ధతి నేర్పరచిన పుణ్యపురుషుడు...భజన పద్ధతి కితడే మూలపురుషుడు. ఇతడు రామామాత్యులకు ముందటివాడని చెప్పుచున్నారు" అని వివరించారు. ఇట్లా తాళ్ళపాకవారి కాలంలోనే, వారి మూలంగానే ఆరంభమైన ఈ పద్ధతి క్రీ. శ. 17 వ శతాబ్దిలో కారణజన్ముడై వెలసిన కంచెర్ల గోపన్న (భద్రాచల రామదాసు) మూలంగా బహుళవ్యాప్తి నందింది. అందుకే 'శ్రీరామ నవరాత్రములలో రామదాసు భజన కీర్తనలను గానంచెయ్యని భజనకూటంగాని, భజనకూటంలేని రామ మందిరంగాని, రామమందిరం లేని గ్రామంకాని నగరంకాని ఆంధ్ర దేశంలో కానపడదు' అన్నారు వాగ్గేయ చరిత్రకారులు శ్రీ రజనీ కాంతరావుగారు. వాస్తవమే రామభక్తి రామదాసులో ఎంత జీర్ణించుకుపోయిందో ఆయన భజన కీర్తనలవల్ల ఆంధ్ర జాతిలోనూ అది అంతగానే జీర్ణమైపోయింది. ఈ నాటికీ ఈ సంప్రదాయం ఆంధ్రి

మొదలైన దేశాల్లోనూ ఆ జాతి జీవనంలో జీర్ణించుకుపోయిన ఒక ముఖ్య సాంస్కృతికాంశగా మిగిలివుంది.

**కంచెర్ల గోపన్న (రామదాసు) క్రీ. 1620-1680**

రామదాసు అసలు పేరు కంచెర్ల గోపన్న. గోలకొండ నేలిన అబ్దుల్లా తానాషా, అబుల్ హసన్ తానాషాల కాలంలో వర్ధిల్లినట్లు తెలియరావడం చేత క్రీ. 1620 ప్రాంతాల్లో పుట్టి ఆ శతాబ్ది చివరి వరకూ జీవించి వుంటాడని అంటారు. జననం నేలకొండపల్లి గ్రామంలో. కామమ్మా లింగనమంత్రీ జననీజనకులు. చదువు సంస్కారంగల కుటుంబం. మంచి శిక్షణ-సజ్జన సాంగత్యం అన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దినవి. చిన్నప్పుడే చదువుకొన్న బాలరామాయణం ఒంట పట్టింది. గొప్ప రామభక్తుడైనాడు. 'ఏలాపుట్టకపోతి నాడే రాములతోడ' అన్న చింత అప్రయత్నంగానే అతని నోట సంకీర్తనమై వెలువడింది. అప్పటి భజన సంఘాలు భజనగోష్ఠులు అతణ్ణి ప్రేరేపించినవి. భక్తకబీర్‌దాస్ ఒకసారి వీళ్ళవూరు వచ్చినప్పుడు ఇతని భక్తితాత్పర్యాలకి మురిసి రామమంత్రాన్ని ఉపదేశించినట్లు. అప్పుడే ఇతడు "తారకమంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా" అన్న కీర్తన పాడుకొన్నట్లు చెప్పుతారు. ఇతని దాశరథి శతకం తెలుగునగల భక్తిశతకాలలో అగ్రశ్రేణికి చెందిన రచన. అందులోనే తన జీవితాన్ని గూర్చిన కొన్ని విశేషాలు కూడా ఆయన చెప్పుకున్నాడు అతడింకా కొన్ని గ్రంథాలు వ్రాసినట్లు వాటిని రేగుపండ్లకును మౌక్తికముల్ వెలపోసినట్లు దురాత్ములకమ్మి మోసపోయినట్లు, అలాటి తన "రసనకు పూతవృత్తి సుకరంబుగ చేసినట్లు వాక్సుధారసములు చిల్క పద్య ముఖరంగమునందు నటింపనెయ్య" అని అందులో దాశరథిని వేడుకొంటాడు కవి. రఘునాథభట్టాచార్యులనే పుణ్యాత్ముడు తనకు మంత్రోపదేశం చేసి వెనుకటి పేరు ఇచ్చినటు అందులోనే చెప్పుకొన్నాడు. ఉన్నదంతా

భాగవత కైంకర్యాలకు సెలవై పోగా చేతిలో చిల్లిగవ్వలేక పెండ్లి అయిన కొత్తల్లోనే తలిదండ్రులు గతించి సంసార పోషణభారం నెత్తిన పడగా, రోజులు గడవక, అప్పుడు గోల్కొండ రాజ్యంలో హైదరాబాదులో ప్రధాన మంత్రి పదవిని వహించి పెద్దహోదాల్లో వున్న తన మేనమామలు మాదన్న అక్కన్నగార్ల వద్దకు వెళ్ళి ఆ ప్రాపకంతో భద్రగిరి తహశీల్దారీ సంపాదించుకొన్నట్లుగా రామదాసు చరిత్రవల్ల తెలుస్తుంది. అదీ దైవ ప్రేరణవల్లనే జరిగిందనిఅంటారు. స్వప్నంలో శ్రీరాముడు దర్శనమిచ్చి తనని అక్కడికి పిలిపించు కొన్నట్లు చెవుతారు.

అప్పటికే పురాణ ప్రసిద్ధమైనది భద్రగిరి పుణ్యక్షేత్రం. శ్రీ సీతారామలక్ష్మణుల మూర్తులు అక్కడ వెలసివుండినా పూజాపుర స్కారాలు లేక ఉండేది. సరిగా ఆనాళ్ళలోనే ఆ ప్రాంతాలలో వుండిన తమ్మలదమ్మక్క అనే భక్తురాలికి స్వప్నంలో స్వామిదర్శన మిచ్చి తానక్కడ వెలసివున్న విషయం తెలుపగా ఆమె అక్కడి గ్రామప్రజల సహకారంతో వెళ్ళి పూజాపురస్కారాలు కల్పించి బ్రహ్మోత్సవాలు జరిపిస్తూ వుండేది.

దండాకారణ్యవాససమయంలో మేరుపుత్రుడైన భద్రుడు కోరిన వరం కారణంగా భద్రగిరిపై శ్రీరామచంద్రమూర్తి వెలయడం, తమ్మలదమ్మక్క మూలంగా ఆ క్షేత్రం ఉనికి లోకానికి వెల్లడి కావడం, తరువాత ప్రభుత్వాధికారిగా అక్కడికి విచ్చేసిన కంచెర్ల గోపన్న భక్తితాత్పర్యాల వల్ల భద్రాచల క్షేత్రమహిమ జగత్ప్రసిద్ధం కావడం అంతా కూడా దివ్యప్రేరణవల్లనే జరిగింది.

గోపన్న భద్రాచలంలోనే తహశీలుదారుగా సకుటుంబంగా వుంటూ భగవంతుని, భాగవతులను సేవించుకొంటూ వుండేవాడు.

... నిల

బడ్డారు. సక్రమంగా విధి నిర్వహిస్తూ శిస్తులు అవీ వసూలు చేస్తూ అక్కడి ఆలయాన్ని ఉద్ధరిద్దామన్న సంకల్పంతో ఆ సొమ్ము అప్పు డప్పుడు వెచ్చిస్తూ స్వామిసేవలో జీవితాన్ని గడిపాడు. మహా భక్తుడై రామదాసు అనిపించుకొన్నాడు.

ఒకసారి భాగవతులకు సంతర్పణం జరుగుతుండగా గోపన్న కొడుకు చిన్నవాడు ప్రమాదవశాన గంజిగుంటలోపడి ప్రాణాలు పోగొట్టుకుంటాడు. సంతర్పణం ముగిశాక తల్లిదండ్రులా విషయం గుర్తిస్తారు. నిర్ఘాంతపోయి పొంగిపొర్లే దుఃఖంతో ఆర్తితో స్వామి వారిని.

"ఎంతపని చేసితివిరామా-నిన్నేమందును సార్వభౌమా
పంతమా నా మీద పరమపావననామ-సంతోషముడిపితివి
సకల సద్గుణధామ॥

నిన్నె దైవంబనుచునమ్మి-రామ
తిన్నగా దుఃఖముల జిమ్మి
కన్నదినమని నెమ్మినిన్ను సేవింపగా
నన్నిట్లు నట్టేట ముంచుటెరుగకపోతి ॥ఎంత॥

అన్నన్నమాటాడవేరా-నీ
కన్నులను ననుచూడవేరా
చిన్నెలన్నియు దరిగియున్న యీ చిన్నన్న
గ్రన్ననను జూడుమూయన్న ఓరామ ॥ఎంత॥

భద్రాద్రి వాసుడేయనుచు-నిరు
పద్రవముగా నుండుననుచు
భద్రగతి కరుణాసముద్ర ఓ శ్రీరామ
భద్ర నిన్నే మదిని భద్రముగ నమ్మితి ॥ఎంత॥

అని వేడుకుంటాడు. పిల్లవానిలో చైతన్యం కలుగదు. అచంచలమైన విశ్వాసంతో మహాభక్తుడైన రామదాసు రాముణ్ణి అర్థిస్తాడు, విలపిస్తాడు.

"కోదండరామ కోదండరామ కోదండరామ కోట్యర్కధామ
నీ దండనాపు నీ వెందుపోకు వాడేలనీకు వద్దుపరాకు
నిరుపమగాత్ర నీరజనేత్ర పురుహూతమిత్ర పుణ్యచారిత్ర
మునువిప్రసుతుని మనిచిన గతిని మనునట్లుసుతుని
మన్నించుమదిని

లాలితహాస లక్ష్మీవిలాస పాలితదాస భద్రాద్రివాస
భద్రాద్రివాస భవ్యవిలాసక్షుద్రవినాశా నుత రామదాస"

అని ఒక సుదీర్ఘమైన పదంలో తన ఆర్తినంతా వెళ్ళబోసుకుంటాడు. మొర ఫలిస్తుంది. పిల్లవానిలో చైతన్యం కలిగి ప్రాణాలు దక్కుతాయి. రామదాసు ధన్యుడౌతాడు. ఆ క్షేత్రమహిమ మరీవెల్లడవుతుంది. వసూలైన శిస్తుసొమ్ముతో భద్రగిరి రామాలయం నిరుపమానంగా రూపొందుతుంది. పరవశించి రామదాసు ఇలా పాడుకుంటాడు.

అదిగో భద్రాద్రి, గౌతమి, ఇదిగో చూడండి.
ముదమున సీతాముదిత లక్ష్మణులు-కలసికొలువగా రఘుపతి
ఉండెడివదిగో॥

చారుస్వర్ణప్రాకార గోపుర-ద్వారములచే సుందరమై

అనుపమానమై అతిసుందరమై-తనరుచక్రము ధగధగ
మెరసెడి-అదిగో॥

శ్రీకరముగ నిల రామదాసుని-ప్రాకటముగ బ్రోచే
ప్రభువాసము-అదిగో।

కాని గిట్టని వాళ్లెవరో చెవులు కొరుకుకుంటారు. వసూలైన శిస్తు సొమ్ము ప్రభువుల భండారానికి చేర్చకుండా రామదాసు దుర్వినియోగం చేస్తున్నాడని ఫిర్యాదు వెడుతుంది. తానాషా సంజాయిషీ అడిగి సొమ్ము పంపమంటాడు కానీ సొమ్మేది! రాజద్రవ్యాపహరణ నేరం క్రింద తానాషా రామదాసుని పన్నెండేళ్లు కారాగారంలో వుంచి నానాబాధలు పెట్టడం జరుగుతుంది. ఎవరూ ఏమీ చేయలేక పోతారు. తాను చేసింది ఎంత సత్కార్యమైనా ప్రభువుల కా విషయం చెప్పిచేయక పోవడం దోషమే అయింది. పన్నెండేళ్ళూ అష్టకష్టాలూ పడి కారాగారంలో మ్రగ్గి చివరికి విషంత్రాగైనా ప్రాణహారణం చేసుకుందామని ప్రయత్నిస్తుండగా శ్రీరాములవారే లక్ష్మణ సహితుడై జవానుల వేషంతో వెళ్ళి రామదాసు ఇచ్చినట్లుగా సొమ్మంతా తిరిగి ఇచ్చివేసి రశీదు తీసుకొని రామదాసు చెర విడిపిస్తారు. తానాషా మనసు మారుతుంది. అప్పటినుండే హైదరాబాదు ప్రభువులు భద్రాచల రాముని కైంకర్యాలకై ప్రతి యేడూ కొంత సొమ్ము వ్యయించడం కట్టడి అయింది. ఇదే రామదాసుని గూర్చి, భద్రాద్రిని గూర్చి గోల్కొండ తానాషాను గూర్చి ఉన్న జనశ్రుతి.

ఏదిఏమైనా ఆయన కారాగారశిక్ష మనపద వాఙ్మయానికి శ్రీరామరక్ష. ఆయన కష్టాలు-బాధ ఒక కరుణ రసాత్మకగాధ ఆయన తన జీవితాన్ని కర్పూరంలా వెలిగించుకుని ఆహుతై పోయి ఆ మంగళహారతి వెలుగులో లోకానికి శ్రీరామదర్శనం చేయించాడు ఆయన గొప్ప వాగ్గేయకారుడు. వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ కూడా రామదాసుడై చరితార్థుడైన ధన్యజీవి. ఎన్నివందల పాటలు పాడుకొన్నాడో కానీ మనకినాడు మిగిలినవీ-ఆ భజన పద్ధతినే అనుసరించిన యాదవదాసు, తూము నరసింహదాసు, కంచివరదరామదాసు ప్రభృతిప్రఖ్యాతభజనపరులు సంప్రదాయసిద్ధంగా పారంపర్యంగా పాడు

కొని నిలిపినవి-రామదాసు జీవితాన్ని నిబంధించిన యక్షగాన రచనల్లో లభించేవీ-అన్నీ కలిసి నూరు నూటముప్పైకన్నా అధికంగా లేవు.

ఆయన ప్రతిపదంలోనూ అడుగడుగునా కానవచ్చేది ఆయన పాండిత్యమూ ప్రాగల్భ్యమూకాదు; ఆర్తి, పరవశింపజేసే భక్తి భావము మాత్రమే. ఆయన ప్రతిచరణ విన్యాసంలోనూ వినిపించేది నూతన ధాతుకల్పనా చమత్కారమో, విశిష్టరాగసంచారయత్నమో కాదు, అప్రయత్నంగా సహజంగా మేళవించిన భావరాగలయలతోడి రక్తిభావమే. ఈయన పాడిన కీర్తనలు ప్రసిద్ధరాగ, రాగాంగరాగ, భాషాంగరాగాల్లోనే కాక దర్బారు, బేగడ, కాఫీ, కమాసు, యమునా కల్యాణివంటి కొన్ని ఉత్తర హిందూస్థానీ రాగాల్లోనూ వున్నాయి. ఒక్క విశేషమేమిటంటే అంతవరకూ వాగ్గేయకారుల రచనల్లో ప్రయుక్తంకాని 'ఆనందభైరవి' రాగం సాంప్రదాయకమైన రామదాసు కీర్తనల్లోనే ప్రథమంగా మనకి వినవస్తుంది. ఆ రాగంలో ఆయన ప్రసిద్ధమైన కీర్తనలెన్నో వున్నవి. (చివరిపట్టిక చూడండి).

సంస్కృతాంధ్రాల్లో ఆయన కీర్తనలు నేటికీ ప్రచారంలో వున్నవి ఎన్నో వున్నవి. వాటినన్నిటినీ సమగ్రంగా సేకరించి, శ్రద్ధగా సస్వరంగా ప్రకటించి నిలువరించుకొనే యత్నం చేయడం చాలా అవసరం.

రామదాసుగారి రామభక్తిని తర్వాతి కాలంలో త్యాగరాజు స్వామివారు కూడా కొనియాడారు. 'క్షీరసాగరశయనా' అనే తమ దేవగాంధారి కీర్తనలో' ధీరుడౌ రామదాసుని బంధము తీర్చినది విన్నానురా అని త్యాగరాజు తన రామభక్తిని రామదాసుకీర్తిని, ఆ శ్రీరామచంద్రుని శక్తిని వెల్లడించాడు.

రామదాసు ఇలా నిబంధ పదరచనలనేకాక వృత్త అనిబంధ పదకవితారీలకు చెందిన పదాలను కూడా చెప్పినట్లు తెలుస్తుంది.

"పాహిరామ ప్రభో పాహిరామప్రభో
పాహిభద్రాద్రి వైదేహిరామప్రభో"

అనే పదం వృత్తపదరీతికి దండక ప్రబంధంలాటిది అలాగే;

"శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండభాండ తండోపతండకరండ మండల శాంతోద్దీపిత సుగుణ నిర్గుణాతీత సచ్చిదానంద పరాత్పర తారక బ్రహ్మాహ్వాయదశదిశప్రకాశం...భద్రాచల రామచంద్రం, రామదాస ప్రసన్నం భజేహం భజేహమ్" అన్న రచన అనిబంధ పదవికవితారీతికి చెందిన చూర్ణపదమే.

ఈ విధంగా ఒక క్రమాన కృష్ణమాచార్యులు, తాళపాక పద కవిత్రయంవారు, రామదాసు మనవాగ్గేయకారులలో తొలి సంకీర్తనా చార్యులై మన పదకవితల కెంతో పరిపుష్టిని చేకూర్చారు-ఎందరో మహానుభావులు. అందరికీ వందనములు.

# అనుబంధం

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు రచించిన వేంకటేశ్వర వచనాలు నేటికి మనకు లభించినవి నూటఅరువదియారు (166) మాత్రమే : వాటిల్లో తాళ్ళపాకవారే రాగిరేకులపై చెక్కించిన వాటికి 48 కి మాత్రమే రాగతాళాల నిర్దేశమున్నది. (చూ పుట 33)

| రాగం | తాళం | వచనసంఖ్య |
|---|---|---|
| ఆహిరి | రూపక | 45 |
| కన్నడ బంగాళ | తివడ | 90 |
| కాంభోజి | తివడ | 43 |
| గుండక్రియ | తివడ | 39 |
| గుజ్జరి | ఏకతాళం | 1 |
| దేవగాంధారి | జంపె | 92 |
| దేశాక్షి | జంపె | 41 |
| దేశాక్షి | రూపక | 86 |
| దేశాక్షి | తివడ | 52 |
| ధన్యాసి | ఏక | 87 |
| ధన్యాసి | జంపె | 88 |
| ధన్యాసి | తివడ | 53 |
| నాట | తివడ | 10 |
| నాట | రూపక | 9 |

| రాగం | తాళం | వచనసంఖ్య |
|---|---|---|
| నాదరామక్రియ | ఏక | 34 |
| నాదరామక్రియ | జంపె | 33 |
| నారాయణి | తివడ | 37 |
| పాడి | ఏక | 44 |
| బౌళి | ఏక | 89 |
| బౌళి | జంపె | 12 |
| బౌళి | తివడ | 31 |
| భూపాల | జంపె | 95 |
| భూపాల | తివడ | 6 |
| భూపాల | రూపక | 27 |
| మలహరి | ఏక | 94 |
| మలహరి | తివడ | 26 |
| మాళవి | — | 85 |
| మాళవిగౌళ | ఏక | 7 |
| మాళవగౌళ | తివడ | 8 |
| ముఖారి | జంపె | 32 |
| ముఖారి | రూపక | 42 |
| రామక్రియ | రూపక | 4 |
| లలిత | జంపె | 5 |
| లలిత | తివడ | 91 |
| వరాళి | తివడ | 30 |
| శంకరాభరణం | తివడ | 2 |
| శుద్ధవసంతం | తివడ | 46 |
| శ్రీరాగం | ఏక | 3 |

| రాగం | తాళం | వచనసంఖ్య |
|---|---|---|
| శ్రీరాగం | జంపె | 36 |
| శ్రీరాగం | తివడ | 35 |
| సామంతం | జంపె | 11 |
| సామంతం | తివడ | 40 |
| సాళంగనాట | ఏక | 29 |
| సాళంగనాట | తివడ | 28 |
| సాళంగనాట | పల్లవి (?) | 38 |
| హిందోళవసంతం | జంపె | 93 |
| హిందోళవసంతం | తివడ | 50 |

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన తాళ్ళపాక వారి శృంగార ఆధ్యాత్మ సంకీర్తనల సంపుటాల ననుసరించి వారు అభిమానించిన రాగాల అకారాది పట్టిక : (ఇచ్చిన అంకెల్లో మొదటిది వారు ఆ రాగాల్లో పాడిన శృంగారసంకీర్తనల సంఖ్య + రెండవది ఆధ్యాత్మ సంకీర్తనల సంఖ్య) ప్రకటింపబడిన 19 సంపుటాలలో శృంగార సంకీర్తనలవి 10, ఆధ్యాత్మ సంకీర్తనలవి 8, శృంగార అధ్యాత్మసంకీర్తనలు కలిపి అచ్చు అయినసంపుటము-1.

| రాగం | శృం + ఆ |
|---|---|
| అమరసింధు | 17 + — |
| ఆందోళి | 4 + — |
| ఆరభి | 5 + — |
| ఆబాలి | 1 + — |
| అహిరి | 375 + 95 |
| ఆహిరినాట | 7 + 1 |
| కన్నడగౌళ | 87 + 59 |
| కన్నడబంగాళం | 11 + — |
| కాంబోది | 181 + 25 |
| కుంతలవరాళి | 10 + 1 |
| కురంజి | 16 + 2 |
| కేదారగౌళ | 94 + 10 |
| కొండమలహరి | 36 + 1 |
| కోకిల పంచమం | 2 + — |
| క్రౌశి | — + 2 |

| రాగం | శృం + అ |
|---|---|
| గంభీరనాట | 8 + — |
| గీతనాట | — + 1 |
| గుండక్రియ | 26 + 95 |
| గుజ్జరి | 15 + 57 |
| గుమ్మకాంబోది | 1 + — |
| గౌళ | 77 + 27 |
| ఛాయానాట | 11 + 3 |
| తెలుగు కాంబోది | 39 + 3 |
| తోండి | 5 + 2 |
| దేవగాంధారి | 43 + 78 |
| దేవప్రియ | — + 2 |
| దేశాక్షి | 90 + 77 |
| దేశి | 14 + 6 |
| దేసాళం | 147 + 66 |
| ద్రావిడభైరవి | 7 + — |
| ధన్యాసి | 58 + 65 |
| నట్టనారాయణి | 10 + — |
| నాగగాంధారి | 6 + — |
| నాగవరాళి | 29 + 5 |
| నాట | 33 + 69 |
| నాదరామక్రియ | 143 + 14 |
| నారణి | 18 + 12 |
| నారాయణి | 19 + — |
| నారణి దేసాక్షి | 3 + — |
| నీలాంబరం | 7 + |

| రాగం | కృ + ఆ |
|---|---|
| పళవంజరం | 9 + 5 |
| పాడి | 281 + 98 |
| పిసాళం | 1 + — |
| పూరిభి | 3 + — |
| పూర్వగౌళ | 8 + 1 |
| ప్రతాపనాట | 4 + 1 |
| బంగాళం | 1 + 3 |
| బలహంస | 12 + 1 |
| బౌళి | 157 + 190 |
| బౌళిరామక్రియ | 18 + 17 |
| భల్లాట | — + 2 |
| భూపాలం | 46 + 61 |
| భైరవి | 181 + 50 |
| మంగళకౌశికి | 76 + 15 |
| మధ్యమావతి | 59 + 3 |
| మనోహరి | 10 + — |
| మలహరి | 22 + 51 |
| మాళవ(శ్రీ) | 16 + 4 |
| మాళవి | 19 + 36 |
| మాళవిగౌళ | 67 + 33 |
| ముఖారి | 373 + 123 |
| ముఖారిపంతు | 3 + — |
| మేఘరంజి | 1 + 3 |
| మేచబౌళి | 21 + 1 |
| రామక్రియ | 231 + 114 |

| రాగం | శృం + అ |
|---|---|
| రాయగౌళ | 3 + 1 |
| రీతిగౌళ | 26 + — |
| రేవగుప్తి | — + 1 |
| లలిత | 117 + 234 |
| వరాళి | 165 + 67 |
| వసంతం | 5 + 7 |
| వసంతవరాళి | 12 + 6 |
| వేళావళి | 2 + — |
| శంకరాభరణం | 298 + 104 |
| శుద్ధదేశి | 35 + 10 |
| శుద్ధరామక్రియ | 3 + — |
| శుద్ధవసంతం | 85 + 59 |
| శోకవరాళి | 5 + 4 |
| శ్రీరాగం | 345 + 142 |
| సామంతం | 396 + 215 |
| సామవరాళి | 7 + 3 |
| సావేరి | 10 + — |
| సాళంగం | 67 + 29 |
| సాళంగనాట | 134 + 126 |
| సింధురామక్రియ | 15 + — |
| సోమరాగం | 1 + — |
| సౌరాష్ట్రం | 53 + 8 |
| సౌరాష్ట్రగుజ్జరి | 3 + — |
| హిందోళం | 12 + 3 |
| హిందోళవసంతం | 35 + 5 |
| హిజ్జజి | 47 + 2 |

తంజావూరు తాళపత్ర ప్రతిలో తాళ్ళపాకవారి సంకీర్తనల కున్న మరికొన్ని రాగాలు —

| | | |
|---|---|---|
| కళ్యాణి | గౌళిపంతు | సారంగ |
| కేదార | పంతువరాళి | |
| ఘంటారావం | బిలహరి | |
| (గుమ్మకాంబోది) | యదుకులకాంబోది | |

తిరుపతి ప్రాచ్య లిఖిత పుస్తక భండారంలోని నెం॥ 6609 ప్రతిలోని తాళ్ళపాక వారి కీర్తనలకున్న మరికొన్ని రాగాలు-

| | |
|---|---|
| ఆళాపచారి | రమామనోహరము |
| నవరోజు-అటతాళం | వసంత భైరవి |
| మారువ ధన్యాసి | |
| మోహనకళ్యాణి | |

తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించిన శృంగార ఆధ్యాత్మ కీర్తనల సంపుటాలు 19ననుసరించి తాళ్ళపాక కవులభిమానించిన రాగాల సంఖ్య మొత్తం 105వరకు ఉన్నాయి వాటిల్లోనూ ఈ క్రింది రాగాలను వారు మిక్కిలి అభిమానంతో పాడుకొన్నారు.

శృంగార సంకీర్తనలు

| రాగం | కీర్తనలు |
|---|---|
| సామంతం | 396 |
| ఆహిరి | 375 |
| ముఖారి | 373 |
| శ్రీరాగం | 345 |
| శంకరాభరణం | 298 |

| రాగం | కీర్తనలు |
| --- | --- |
| భైరవి | 181 |
| నాదరామక్రియ | 143 |
| పాడి | 281 |
| రామక్రియ | 231 |
| కాంబోది | 181 |

### ఆధ్యాత్మ సంకీర్తనలు

| | |
| --- | --- |
| లలిత | 234 |
| సామంతం | 215 |
| బౌళి | 190 |
| శ్రీరాగం | 142 |
| సాళంగనాట | 126 |
| ముఖారి | 123 |
| రామక్రియ | 114 |
| శంకరాభరణం | 104 |
| పాడి | 98 |
| ఆహిరి; గుండక్రియ | 95 |

తాళ్ళపాక కవులు తమ సంకీర్తనలలో మొత్తంమీద అభిమానించినరాగాల క్రమము (అచ్చయిన 19 సంపుటాలననుసరించి) :

| రాగం | కీర్తనలు |
| --- | --- |
| సామంతం | 611 |
| ముఖారి | 496 |

| రాగం | కీర్తనలు |
|---|---|
| శ్రీరాగం | 487 |
| ఆహిరి | 470 |
| శంకరాభరణం | 402 |
| లలిత | 381 |
| పాడి | 379 |
| బౌళి | 347 |
| రామక్రియ | 345 |
| సాళంగనాట | 259 |
| వరాళి | 232 |
| భైరవి | 231 |
| కాంబోది | 206 |
| నాదరామక్రియ | 157 |

అచ్చయి ప్రచారంలోనున్న 'రామదాసు చరిత్రము'లోని రామదాసు కీర్తలనుబట్టి ఆయన ఈ క్రింది రాగాలను అభిమానించి నట్లు తెలుస్తున్నది.

| రాగం | లభించిన కీర్తనలు |
|---|---|
| నాదనామక్రియ | 21 |
| ఆనందభైరవి | 11 |
| వరాళి | 8 |
| సావేరి | 7 |
| అసావేరి | 6 |
| కళ్యాణి | 6 |

| రాగం | లభించిన కీర్తనలు |
|---|---|
| కాంభోజి | 6 |
| మోహన | 6 |
| ధన్యాసి | 5 |
| పున్నాగవరాళి | 5 |
| మధ్యమావతి | 5 |
| శంకరాభరణం | 5 |
| సౌరాష్ట్రి | 5 |
| కాఫీ | 2 |
| గౌళిపంతువరాళి | 2 |
| నాట | 2 |
| పంతువరాళి | 2 |
| బిలహరి | 2 |
| బేగడ | 2 |
| యదుకుల కాంభోజి | 2 |
| శహన | 2 |
| సురటి | 2 |
| జంఝూటి | 1 |
| తోడి | 1 |
| నవరోజు | 1 |
| పూర్వ కళ్యాణి | 1 |
| ముఖారి | 1 |
| రేగుప్తి | 1 |

ఇవికాక ఇతరత్రా వీరి కీర్తనలకు మరికొన్ని రాగాల పాఠాలు కూడా ఉన్నవి.

రాగం

---

కమాసు

దర్బారు

నీలాంబరి

సైంధవి

ఆనందభైరవి రాగంలో రామదాసు అభిమానించి పాడుకొన్న కీర్తనలు కొన్ని-

1. ఆశపుట్టె శ్రీరాములతో ఆహానాడే పుట్టకపోతి
2. ఎటుపోతి వోరామ
3. ఏటికి దయరాదు శ్రీరాములు
4. కలియుగ వైకుంఠము భద్రాచలనిలయము
5. తెలియకనే మోసపోతిని
6. పలుకే బంగార మాయెనా కోదండపాణి
7. భారములన్నిటికి నీవె యనుచు నిర్భయుడనై
8. మేలైన చిటికెన వ్రేలు
9. రామనామమే జీవనము
10. రామ నీ చేతేమి కాదుగా
11. రాముని బంటు[illegible] కేమి విచారము

భజన పరుల నాలుకలపై నాట్యమాడే రామదాసు కీర్తనలు ప్రసిద్ధమైనవి మరికొన్ని—

1. అంతా రామమయం బీ జగమంతా రామమయం
2. ఇక్ష్వాకుకుల తిలక ఇకనైన పలుకవే
3. ఏ తీరుగ నను దయజూచెదవో యినవంశోత్తమ రామా
4 గరుడగమన రారా నను నీ కరుణ నేలుకోరా
5. చరణములే నమ్మితి నీ దివ్య చరణములే
6. తక్కువేమి మనకు రాముడొక్కడుండు వరకు
7. తారక మంత్రము కోరిన దొరికెను
8. నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి
9. పాహి రామ ప్రభో పాహిరామ ప్రభో
10. పాహిమాం శ్రీరామా యంటే పలుకవైతివి
11. శ్రీరామ నీ నామ మేమి రుచిరా
12. సీతారామస్వామి నే జేసిన నేరంబేమి

—:o o:—